





# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు









సంపుటి : 1 సంచిక : 155 పేజీలు :8 | సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) | ప్రచురణ : శ్రీకాకుళం | బుధవారం 17 జూన్ 2026 | వెల : 5/-రూ ॥

VOLUME :1 ISSUE : 155 PAGES :8 | EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) | PUBLISHED : SRIKAKULAM | WED 17 JUNE 2026 | PRICE : 5/- RS

Simultaneously Published form Srikakulam,Ongole,Visakhapatnam,Kakinada,West Godavari,Bapatla,Narasarao Peta, Ongole, SPSR Nellore, Tirupati, Chittor, YSR Kadapa,Circulated by : manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur,Kurnool,Anantapur


## ఏపీలో అద్భుత అవకాశాలు..
# పెట్టుబడులు పెట్టండి

- సింగపూర్ సమ్మిట్‌లో అమరావతి బ్రాండింగ్.. చంద్రబాబు కీలక ప్రసంగం
- సింగపూర్‌లో వరల్డ్ సిటీస్ సమ్మిట్‌లో ప్రసంగించిన సీఎం చంద్రబాబు
- సరికొత్త ఆలోచనలతో అమరావతికి రావాలని పెట్టుబడిదారులకు ఆహ్వానం
- అభివృద్ధికి, సంపద సృష్టికి సైబరాబాద్ నిదర్శనమని వ్యాఖ్య
- ప్రజా రాజధానిగా అమరావతిని ప్రపంచస్థాయి నగరంగా తీర్చిదిద్దుతామని వెల్లడి
- సింగపూర్ ఇన్నోవేషన్, టెక్నాలజీ ప్రదర్శన స్టాళ్లను సందర్శించిన ముఖ్యమంత్రి




**పెన్ పవర్ డెస్క్:**ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిని అవకాశాల గనిగా అభివర్ణించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, సరికొత్త ఆలోచనలతో పెట్టుబ డులు పెట్టేందుకు ముందుకు రావాలని అంతర్జాతీయ సమాజానికి పిలుపునిచ్చారు. సింగపూర్‌లో జరుగుతున్న 'వరల్డ్ సిటీస్ సమ్మిట్'లో భాగంగా తన పర్యటన రెండో రోజు ఆయన 'కెన్ స్మార్ట్ సిటీస్ లవ్ హ్యూమన్స్' అనే అంశంపై ప్లీనరీలో ప్రసంగించారు. అమరావతిని ఒక ప్రజా రాజధానిగా, ప్రపంచంలోనే అత్యుత్తమ నగరాల్లో ఒకటిగా తీర్చిదిద్దుతున్నామని చంద్రబాబు స్పష్టం చేశారు.అమరావతిని కేవలం పరిపాలనా నగరంగా కాకుండా, ఒక నాలెడ్జ్ సిటీగా తీర్చిదిద్దుతున్నామని, ఇప్పటికే పలు జాతీయ, అంతర్జాతీయ విద్యాసంస్థలు వస్తున్నాయని

- మిగతా 2లో



## ఏపీ పీఈసెట్ ఫలితాలు విడుదల
## చేసిన విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్

- ఏపీ పీఈసెట్-2026 ఫలితాలను విడుదల చేసిన మంత్రి లోకేశ్
- ఈ ఏడాది మొత్తంగా 89.76 శాతం ఉత్తీర్ణత నమోదు
- మొత్తం 2,958 మంది పరీక్ష రాయగా 2,655 మంది అర్హత
- పురుషుల్లో 92.91 శాతం, మహిళల్లో 81.43 శాతం మంది ఉత్తీర్ణులు
- వెబ్‌సైట్, వాట్సాప్ ద్వారా ఫలితాలు తెలుసుకునే అవకాశం

- మిగతా 2లో



## 'దిశ' ఫెయిల్..
## 'శక్తి' సక్సెస్

- ఏపీలో క్రైం రేటు 14.1 శాతం తగ్గిందన్న అనిత
- గత ప్రభుత్వ హయాంలో దిశ చట్టం అమలు కాలేదని విమర్శ
- ఇప్పటి వరకు 2,366 గంజాయి కేసులు నమోదు చేశామని వెల్లడి

- మిగతా 2లో

## కేంద్ర జలశక్తి మంత్రితో పవన్ భేటీ..
## 'సూరత్ నమూనా'పై కీలక చర్చ!

- సీఆర్ పాటిల్ తో పవన్ కల్యాణ్ భేటీ
- రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల్లో నీటి కొరత తీరలేదని చెప్పిన పవన్
- నదీ జలాల స్వచ్ఛతపై దృష్టి పెట్టాలని అధికారులకు సూచన

**పెన్ పవర్ డెస్క్:**ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఢిల్లీ పర్యటనలో బిజీగా ఉన్నారు. ఆయన కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్‌తో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. రాష్ట్రంలోని తాగునీటి ఎద్దడి, కలుషితమవుతున్న



- మిగతా 2లో

## నీట్ రీ-ఎగ్జామ్ నేపథ్యంలో టెలిగ్రామ్‌పై
# తాత్కాలిక నిషేధం

- భారత్‌లో యాప్‌పై ఆంక్షలు.. స్పందించిన టెలిగ్రామ్ సీఈఓ
- చీటింగ్, తప్పుడు ప్రచారాలను అరికట్టేందుకే ఈ నిర్ణయం
- జూన్ 21న దేశవ్యాప్తంగా నీట్-యూజీ పునఃపరీక్ష
- కేంద్రం చర్యను తప్పుబట్టిన టెలిగ్రామ్ సీఈవో పావెల్ దురోవ్
- ప్లే స్టోర్ నుంచి టెలిగ్రామ్ యాప్‌ను తొలగించిన గూగుల్

**పెన్ పవర్ డెస్క్:**నీట్-యూజీ 2026 పునఃపరీక్షను అత్యంత పకడ్బందీగా నిర్వహించేందుకు కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇందులో భాగంగా ప్రముఖ మెసేజింగ్ యాప్ టెలిగ్రామ్‌పై దేశవ్యాప్తంగా జూన్ 22 వరకు తాత్కాలిక ఆంక్షలు విధించింది. పరీక్ష సమయంలో చోటుచేసుకునే అక్రమాలను, తప్పుడు ప్రచారాలను అరికట్టడమే లక్ష్యంగా ఈ చర్యలు చేపట్టింది. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ) సిఫార్సు మేరకు ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ చట్టంలోని సెక్షన్ 69ఏ కింద ఈ ఆదేశాలు జారీ అయ్యాయి.కేంద్ర ప్రభుత్వ నిర్ణయంపై

- మిగతా 2లో





## జులై మూడో వారంలో 'తల్లికి వందనం'..
## విద్యాశాఖ అధికారులతో మంత్రి లోకేశ్ సమీక్ష

**పెన్ పవర్ డెస్క్:**రాష్ట్ర విద్యావ్యవస్థను సమూలంగా ప్రక్షాళన చేసి, విద్యార్థులకు నాణ్యమైన భవిష్యత్తును అందించే దిశగా ప్రభుత్వం కీలక అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగా, విద్యా, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ విద్యాశాఖ అధికారులతో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వ, ప్రైవేటు

- మిగతా 2లో

## ఫీజుల దోపిడీ... భగ్గుమన్న ఏబీవీపీ..
## హైదరాబాద్‌లో ఉద్రిక్తత, పలువురి అరెస్ట్

- ప్రైవేట్ పాఠశాలల ఫీజుల నియంత్రణ కోరుతూ ఏబీవీపీ ఆందోళన
- హైదరాబాద్ లో పాఠశాల విద్యాశాఖ కమిషనరేట్ వద్ద ఉద్రిక్తత
- ఫీజుల నియంత్రణకు వెంటనే చట్టం తేవాలని డిమాండ్
- ప్రభుత్వ హామీలున్నా ఫీజుల పెంపుతో ఇబ్బందులు పడుతున్న తల్లిదండ్రులు
- నిరసనకు దిగిన పలువురు ఏబీవీపీ కార్యకర్తలను అరెస్ట్ చేసిన పోలీసులు



**పెన్ పవర్ డెస్క్:**ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలు విచ్చలవిడిగా పెంచుతున్న ఫీజులను అరికట్టాలని, ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాలు మెరుగుపరచాలని డిమాండ్ చేస్తూ అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) మంగళవారం హైదరాబాద్‌లో చేపట్టిన

- మిగతా 2లో

## ఫ్రాన్స్‌లో జీ7 సదస్సు.. కరచాలనం
# చేసుకున్న మోదీ, ట్రంప్




- ఫ్రాన్స్‌లో జరుగుతున్న జీ7 సదస్సుకు ప్రధాని మోదీ హాజరు
- హర్ముజ్ గుండా చమురు సరఫరా సులభతరమైందన్న ట్రంప్
- రష్యా చమురుపై త్వరలో మళ్లీ ఆంక్షలు విధిస్తామని వెల్లడి

**పెన్ పవర్ డెస్క్:**ఫ్రాన్స్‌లోని ఇవియాన్‌లో జరుగుతున్న జీ7 శిఖరాగ్ర సదస్సులో భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాల్గొన్నారు. మంగళవారం నిర్వహించిన కీలకమైన 'ఔట్‌రీచ్ సెషన్'లో భాగంగా ఆయన ప్రపంచ నేతలతో కలిసి

- మిగతా 2లో

## దక్షిణ కోస్తాంధ్ర వరకు
# విస్తరించిన ద్రోణి

**పెన్ పవర్ డెస్క్:**విశాఖపట్నం(ఏయూ ప్రాంగణం): తూర్పు విదర్భ, తెలంగాణ మీదుగా దక్షిణ కోస్తాంధ్ర వరకు ద్రోణి విస్తరించి ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. 'బుధవారం విజయనగరం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, పోలవరం, ఏలూరు,

- మిగతా 2లో





## కాంగ్రెస్ వైఖరిపై బండి సంజయ్ నిప్పులు..
## తెలంగాణకు రూ. 10 లక్షల కోట్లు కేటాయించామని వెల్లడి

- తెలంగాణ ప్రగతికి కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందన్న బండి సంజయ్
- అక్రమ వలసదారుల ఓట్లపై కాంగ్రెస్ ఎందుకు మౌనంగా ఉందని ప్రశ్న
- తెలంగాణలో డబుల్ ఇంజిన్ సర్కార్ రావాలని వ్యాఖ్య

**పెన్ పవర్ డెస్క్:**తెలంగాణ అభివృద్ధిని అడ్డుకునే ప్రసక్తే లేదని, ప్రధా ని నరేంద్ర మోదీ నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం తెలంగాణ ప్రగతికి ఎల్లప్పుడూ

- మిగతా 2లో




# టీడీపీ, జనసేనల మధ్య గ్యాప్ పెరిగిందా?

ఆంధ్రప్రదేశ్ లో కూటమి పార్టీల మధ్య సఖ్యత లేదన్నది స్పష్టంగా కనిపిస్తుంది. ముఖ్యంగా ప్రభుత్వంపై విపక్ష వైసీపీ చేస్తున్న ఆరోపణలకు టీడీపీ మాత్రమే సమాధానం చెప్పుకోవాల్సి వస్తుంది. కానీ కూటమిలో ప్రధాన మిత్ర పక్షంగా ఉన్న జనసేన మాత్రం అస్సలు విపక్షాల విమర్శలకు కనీసం సమాధానం చెప్పడం లేదు. కౌంటర్ ఇవ్వడం లేదు. ఈ పరిణామాలు కింది స్థాయి కార్యకర్తలకు తప్పుడు సంకేతాలు వెళుతున్నాయి. అసలు కూటమి పార్టీల్లో సమన్వయం ఉందా? లేదా? అన్న అనుమానం పార్టీ నేతలు, కార్యకర్తల్లో మొదలయింది. ఇందుకు కారణాలు ఏంటనేది బయటకు తెలియకపోయినా జనసేన మౌనంగా ఉండటం ఎన్నో సందేహాలకు తావిస్తుంది.

**మెగా డీఎస్సీపై వైసీపీ...**

గత కొంతకాలంగా వైసీపీ మెగా డీఎస్సీ పై తీవ్ర ఆరోపణలు చేస్తుంది. మెగా డీఎస్సీలో భారీగా అవకతవకలు జరిగాయని వైసీపీ ఆరోపిస్తుంది. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ నుంచి కింది స్థాయి నేతల వరకూ మీడియా సమావేశాల్లోనూ, సోషల్ మీడియాలోనూ మెగా డీఎస్సీపై తీవ్ర స్థాయిలో విమర్శలు చేస్తుంది. మెగా డీఎస్సీ కింద 16వేల ఉద్యోగాలను కూటమి ప్రభుత్వం భర్తీ చేసింది. ఉద్యోగాలు వచ్చిన ప్రతి ఒక్కరికీ పెద్ద పండగలా చేస్తూ అందరికీ టీడీపీ నేత చంద్రబాబు, జనసేన అధినేత పవన్ కల్యాణ్, బేజేపీ చీఫ్ మాధవ్ లు కలసి నియామక పత్రాలను అందచేశారు. విద్యాశాఖకు మంత్రి నారా లోకేశ్ పర్యవేక్షిస్తున్నారు. ఈ నేపథ్యంలో కనీసం డీఎస్సీపై వైసీపీ చేసిన ఆరోపణలపై జనసేన స్పందించకపోవడం చర్చనీయాంశమైంది.

**మంత్రివర్గంలో కలసి ఉన్నా...**

మంత్రివర్గంలో జనసేన కలసి ఉంది. ప్రభుత్వంపై వస్తున్న ఆరోపణలకు కలసి కట్టుగా సమాధానం చెప్పాల్సి ఉన్న సమయంలో జనసేన మాత్రం తమకేమీ పట్టనట్లు వ్యవహరించడం ఇప్పుడు ఏపీ రాజకీయాల్లో హాట్ టాపిక్ గా మారింది. అందులోనూ లోకేశ్ నేతృత్వం వహిస్తున్న శాఖలో అవినీతి ఆరోపణలు వస్తే కూటమి మిత్ర పక్షాలన్నీ కలసి వాటిపై వివరణ ఇవ్వాల్సి ఉండగా కేవలం టీడీపీ నేతలు మాత్రమే దీనిపై వివరణలు ఇస్తున్నారు. అలాగే వైసీపీ ఆరోపణలను ఖండిస్తున్నారు. జనసేన అధినేత పవన్ కల్యాణ్ నుంచి మంత్రులు, ఎమ్మెల్యేల వరకూ మెగా డీఎస్సీపై వైసీపీ చేసిన ఆరోపణలకు ఏ మాత్రం స్పందించకపోవడంతో ఎందుకిలా జరుగుతుందన్న అనుమానాలు బయలుదేరాయి. మొత్తం మీద జనసేన వ్యవహారం టీడీపీ లోని కొందరి నేతలకు మింగుడు పడటం లేదు.

## జులై మూడో వారంలో 'తల్లికి వందనం'.. విద్యాశాఖ అధికారులతో మంత్రి లోకేశ్ సమీక్ష

- మొదటి పేజి తరువాయి

పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల తల్లులకు ఆర్థిక సాయం అందించే 'తల్లికి వందనం' పథకాన్ని జులై మూడో వారంలో అమలు చేసేందుకు సిద్ధం కావాలని అధికారులను ఆదేశించారు. దీంతో పాటు, పాఠశాల విద్య నుంచి ఉన్నత విద్య వరకు పలు కీలక అంశాలపై మంత్రి దిశానిర్దేశం చేశారు.

ఉండవల్లిలోని తన నివాసంలో పాఠశాల, ఉన్నత విద్యాశాఖల అధికారులతో మంత్రి సుదీర్ఘంగా సమీక్షించారు. 'తల్లికి వందనం' పథకం అమలుపై ప్రధానంగా చర్చించారు. తల్లుల ఆధార్ వెరిఫికేషన్ ప్రక్రియ దాదాపుగా పూర్తయిందని, జులై మూడో వారంలో పథకాన్ని అమలు చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని అధికారులు మంత్రికి వివరించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల ప్రవేశాలను పెంచేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని లోకేశ్ స్పష్టం చేశారు. విద్యార్థుల్లో ప్రతిభను వెలికితీసేందుకు జూన్ 29న 'షైనింగ్ స్టార్స్' కార్యక్రమం, తల్లిదండ్రులను భాగస్వాములను చేసేందుకు జులై మూడో వారంలో 'మెగా పీటీఎం' నిర్వహించాలని ఈ సమావేశంలో నిర్ణయించారు. మిగులు ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియపైనా చర్చించారు.పాఠశాల విద్యపై సమీక్ష అనంతరం, ఉన్నత విద్యారంగంపై మంత్రి లోకేశ్ దృష్టి సారించారు. రాష్ట్రంలో నిర్వహించే ఎప్సెట్, పాలిసెట్, ఆర్సెట్ వంటి 12 రకాల ఉమ్మడి ప్రవేశ పరీక్ష (సెట్)ల నిర్వహణలో ఎలాంటి జాప్యం జరగకూడదని గట్టిగా ఆదేశించారు. సాధ్యమైనంత త్వరగా నోటిఫికేషన్లు విడుదల చేసి, నిర్ణీత గడువులోగా అడ్మిషన్ల ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. జాతీయ స్థాయి పరీక్షలు, పొరుగు రాష్ట్రాల సెట్ల తేదీలను దృష్టిలో ఉంచుకుని, విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా షెడ్యూల్ ఖరారు చేయాలని స్పష్టం చేశారు. రాష్ట్రంలోని 254 ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల్లో 1.88 లక్షల ఇంజనీరింగ్ సీట్ల భర్తీకి ఎప్సెట్ నోటిఫికేషన్ సిద్ధంగా ఉందని అధికారులు తెలిపారు. ప్రభుత్వ ఇంజనీరింగ్, పాలిటెక్నిక్ కళాశాలల్లో సీట్ల పెంపును పరిశీలించాలని, ముఖ్యంగా డిమాండ్ ఉన్న మెకానికల్, సివిల్ బ్రాంచ్ లపై దృష్టి పెట్టాలని సూచించారు.రాష్ట్రానికి ప్రపంచస్థాయి విద్యాసంస్థలను తీసుకురావడం ద్వారా ఉన్నత విద్యా ప్రమాణాలను పెంచాలని మంత్రి ఆకాంక్షించారు. థాపర్ ఇనిస్టిట్యూట్, జేమ్స్ కుక్ యూనివర్సిటీ, మెల్ బోర్న్ యూనివర్సిటీ వంటి ప్రతిష్ఠాత్మక జాతీయ, అంతర్జాతీయ సంస్థలు రాష్ట్రంలో తమ క్యాంపస్‌లను ఏర్పాటు చేసేందుకు చూపుతున్న ఆసక్తిపై చర్చించారు. ముఖ్యంగా, జీఎంఆర్ మాన్సాస్ ఏవియేషన్ యూనివర్సిటీ ఏర్పాటు ప్రక్రియను వేగవంతం చేయాలని లోకేష్ ఆదేశించారు.

ఇదే సమయంలో, రాష్ట్రంలో ఎన్‌సీసీ కార్యకలాపాలను సమన్వయం చేసేందుకు ప్రత్యేక 'ఎన్‌సీసీ స్టేట్ డైరెక్టరేట్'ను మంజూరు చేసిన కేంద్ర ప్రభుత్వానికి మంత్రి ధన్యవాదాలు తెలిపారు. ఈ నిర్ణయంతో ఏపీ యువతకు సైనిక శిక్షణలో మరిన్ని అవకాశాలు లభిస్తాయని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ సమావేశంలో విద్యాశాఖ ప్రధాన కార్యదర్శి జె. శ్యామలరావు, పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ తమీమ్ అన్సారియా, ఉన్నతవిద్యా కమిషనర్ నారాయణ్ భరత్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

# ఏపీలో అద్భుత అవకాశాలు.. పెట్టుబడులు పెట్టండి

- మొదటి పేజి తరువాయి

చంద్రబాబు వివరించారు. క్రీడలు, ఆర్థిక, విజ్ఞానం, న్యాయ, పర్యాటక, ఆరోగ్యం, మీడియా వంటి థీమ్ లతో అమరావతిని అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. క్వాంటం కంప్యూటింగ్ హబ్, డిజిటల్ మౌలిక వసతులు దీనికి ప్రత్యేకతను తెస్తాయని పేర్కొన్నారు. 21 కిలోమీటర్ల కృష్ణా నది తీరం వెంబడి వాటర్ ఫ్రంట్ సిటీగా, ఇన్నర్-ఔటర్ రింగ్ రోడ్లు, ఐకానిక్ వంతెనలతో అమరావతి అద్భుతంగా రూపుదిద్దుకోనుందని అన్నారు. సైక్లింగ్, వాకింగ్ ట్రాక్‌లు, గ్రీన్ ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్, భూగర్భ యుటిలిటీస్, గ్రీన్ ఎనర్జీ, నెట్ జీరో ఉద్గారాల లక్ష్యంగా రాజధాని నిర్మాణం జరుగుతోందని చెప్పారు. ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా, తమ పిలుపు మేరకు రైతులు 35 వేల ఎకరాల భూమిని స్వచ్ఛందంగా రాజధాని కోసం ఇచ్చారని, ఆ భూమిని అభివృద్ధి చేసి రైతులకు ప్లాట్ల రూపంలో తిరిగి ఇచ్చే ల్యాండ్ పూలింగ్ మోడల్‌ను ఆయన సదస్సులో వివరించారు. అభివృద్ధి ద్వారానే సంపద సృష్టి సాధ్యమని చెప్పేందుకు తాను గతంలో నిర్మించిన సైబరాబాద్‌ను చంద్రబాబు ఉదాహరణగా చూపారు. "25 ఏళ్ల క్రితం నేను ఐటీ గురించి మాట్లాడాను. భవిష్యత్తును ముందుగానే ఊహించి 'ఫస్ట్ మూవర్ అడ్వాంటేజ్' తీసుకున్నాం. దాని ఫలితంగానే నేడు తెలుగువారు తలసరి ఆదాయంలో ముందున్నారు. ఇప్పుడు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) గురించి ఆలోచిస్తున్నాం," అని ఆయన అన్నారు. నాడు తాను నిర్మించిన సైబరాబాద్ నేడు తెలంగాణకు ప్రధాన ఆదాయ వనరుగా మారిందని, ఒకప్పుడు ఎకరం రూ. 2 లక్షలు ఉన్న భూమి ఇప్పుడు రూ. 200 కోట్లకు పెరిగిందని గుర్తు చేశారు. రాష్ట్ర విభజన తర్వాత మరోసారి కొత్త నగరాన్ని నిర్మించే అవకాశం తనకు దక్కిందని పేర్కొన్నారు.

ప్రసంగం అనంతరం, సదస్సు ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సింగపూర్ ఇన్నోవేషన్, టెక్నాలజీ ప్రదర్శన స్టాళ్లను ముఖ్యమంత్రి సందర్శించారు. సింగపూర్ పెవిలియన్‌లోని అత్యాధునిక పట్టణాభివృద్ధి నమూనాలను, 'ఇన్నోవేటర్స్ అలే'లో స్టార్టప్‌ల ఆవిష్కరణలను, గూగుల్ స్టాల్‌ను ఆసక్తిగా పరిశీలించారు. టెక్నాలజీ ఆధారిత పాలనలో సింగపూర్ అనుభవాలను అడిగి తెలుసుకున్నారు.

## 'దిశ' ఫెయిల్.. 'శక్తి' సక్సెస్

ఏ రాష్ట్రానికైనా పెట్టుబడులు, పరిశ్రమలు రావాలంటే అక్కడ శాంతిభద్రతలు పటిష్ఠంగా ఉండాలని ఏపీ హోంమంత్రి వంగలపూడి అనిత స్పష్టం చేశారు. ఈరోజు నిర్వహించిన మీడియా సమావేశంలో కూటమి ప్రభుత్వ పోలీసింగ్ తీరుపై ఆమె పూర్తి స్థాయి రిపోర్ట్ కార్డ్‌ను బయటపెట్టారు. గత ప్రభుత్వ హయాంలో 'దిశ' చట్టం అమలు కాలేదని విమర్శిస్తూ.. తమ హయాంలో క్రైం రేట్ గణనీయంగా తగ్గిందని లెక్కలతో సహా వివరించారు. ఏపీలో క్రైం రేటు 14.1 శాతం తగ్గిందని హోంమంత్రి వెల్లడించారు. సీసీటీవీలు, డ్రోన్ టెక్నాలజీ వాడకం వల్లే ఇది సాధ్యమైందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా లక్ష సీసీ కెమెరాల టార్గెట్ పెట్టుకోగా, ఇప్పటికే 70 శాతం పూర్తి చేశామని, నేరం జరిగిన 24 గంటల్లోనే నిందితులను పట్టుకుంటున్నామని చెప్పారు. మహిళలపై నేరాల్లో 6.9 శాతం తగ్గుదల నమోదైందని తెలిపారు. తాము ఐజీ స్థాయి అధికారితో 'శక్తి యాప్' తెచ్చామని, దీనిని 1.5 కోట్ల మంది డౌన్లోడ్ చేసుకున్నారని తెలిపారు. లైంగిక నేరాల దర్యాప్తు నాణ్యత 31 శాతం నుంచి ఏకంగా 90 శాతానికి పెరిగిందని, 591 మందికి శిక్షలు పడ్డాయని వివరించారు. 'ఈగల్ టీమ్' ద్వారా నార్కోటిక్స్‌పై ఉక్కుపాదం మోపుతున్నామని, ఏపీ మోడల్‌ను తెలంగాణ కూడా అనుసరిస్తుండడం మనకు గర్వకారణమన్నారు. ఇప్పటివరకు 2,366 గంజాయి కేసులు నమోదు చేసి, 986 మందిని అరెస్ట్ చేశామన్నారు. అలాగే సైబర్ క్రైమ్స్ కోసం ప్రత్యేక 'వార్ రూమ్' ఏర్పాటు చేస్తున్నామని, రూ. 247 కోట్ల సైబర్ ఫ్రాడ్ మనీని ఫ్రీజ్ చేయడంతో పాటు 8 వేలకు పైగా ఇల్లీగల్ ఆన్‌లైన్ కంటెంట్‌ను తొలగించామని స్పష్టం చేశారు.

## ఏపీ పీఈసెట్ ఫలితాలు విడుదల చేసిన విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్

ఆంధ్రప్రదేశ్‌లో ఫిజికల్ ఎడ్యుకేషన్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ (ఏపీ పీఈసెట్-2026) ఫలితాలు విడుదలయ్యాయి. రాష్ట్ర ఐటీ, మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేశ్ ఈ ఫలితాలను మంగళవారం ప్రకటించారు. ఈ ఏడాది పీఈసెట్‌లో మొత్తం 89.76 శాతం ఉత్తీర్ణత నమోదైనట్లు ఆయన తెలిపారు.ఫలితాల వివరాల్లోకి వెళితే, పీఈసెట్-2026 కోసం మొత్తం 4,037 మంది అభ్యర్థులు నమోదు చేసుకోగా, 2,958 మంది పరీక్షకు హాజరయ్యారు. వీరిలో 2,655 మంది అర్హత సాధించారు. అర్హత సాధించిన వారిలో పురుషులు అధికంగా ఉన్నారు. పరీక్షకు హాజరైన పురుషుల్లో 92.91 శాతం (1,993 మంది) ఉత్తీర్ణులు కాగా, మహిళల్లో 81.43 శాతం (662 మంది) ఉత్తీర్ణత సాధించినట్లు అధికారులు వెల్లడించారు.ఈ సందర్భంగా మంత్రి నారా లోకేశ్ మాట్లాడుతూ, ఫిజికల్ ఎడ్యుకేషన్, క్రీడల రంగంలో కెరీర్‌ను ఎంచుకునే దిశగా ముందడుగు వేసిన అభ్యర్థులందరికీ శుభాకాంక్షలు తెలిపారు. వారి భవిష్యత్ ప్రయత్నాలు విజయవంతం కావాలని ఆకాంక్షించారు.అభ్యర్థులు తమ ఫలితాలను అధికారిక వెబ్‌సైట్ cets.apsche.ap.gov.in/PECET/ లో చూసుకోవచ్చు. ర్యాంక్ కార్డులను కూడా ఇదే వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. అదనంగా, 'మన మిత్ర' వాట్సాప్ నంబర్ 9552300009 ద్వారా కూడా ఫలితాలను తెలుసుకునే సౌకర్యాన్ని కల్పించారు.

## ఫీజుల దోపిడీ... భగ్గుమన్న ఏబీవీపీ.. హైదరాబాద్‌లో ఉద్రిక్తత, పలువురి అరెస్ట్

- మొదటి పేజి తరువాయి

ఆందోళన ఉద్రిక్తతకు దారితీసింది. పాఠశాల విద్యాశాఖ కమిషనరేట్ కార్యాలయం ముట్టడికి యత్నించిన పలువురు ఏబీవీపీ కార్యకర్తలను పోలీసులు అరెస్ట్ చేశారు.వివరాల్లోకి వెళితే, ఏబీవీపీ జాతీయ కార్యదర్శి శ్రావణ్ బి. రాజ్ నేతృత్వంలో విద్యార్థి సంఘం నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో సైఫాబాద్‌లోని కమిషనరేట్ కార్యాలయానికి చేరుకున్నారు. ప్రైవేట్ విద్యాసంస్థల ఫీజుల దోపిడీని అరికట్టాలని, ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేస్తూ నినాదాలు చేశారు. ఈ క్రమంలో కార్యాలయంలోకి దూసుకెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసులు వారిని అడ్డుకున్నారు. దీంతో పోలీసులకు, ఆందోళనకారులకు మధ్య స్వల్ప తోపులాట చోటుచేసుకుంది. అనంతరం పోలీసులు పలువురిని అదుపులోకి తీసుకుని సమీప పోలీస్ స్టేషన్లకు తరలించారు.

ప్రైవేట్ పాఠశాలల ఫీజుల దోపిడీని నియంత్రించేందుకు తక్షణమే 'ఫీజుల నియంత్రణ చట్టం' తీసుకురావాలని ఏబీవీపీ చాలాకాలంగా డిమాండ్ చేస్తోంది. ప్రభుత్వ ఆదేశాలు, హామీలు ఉన్నప్పటికీ, 2026-27 విద్యా సంవత్సరానికి హైదరాబాద్‌లోని అనేక పాఠశాలలు 20 నుంచి 50 శాతం వరకు ఫీజులు పెంచేశాయని విద్యార్థి సంఘం నాయకులు ఆరోపించారు. దీనికి తోడు పుస్తకాలు, యూనిఫామ్‌ల పేరుతో వేల రూపాయలు అదనంగా వసూలు చేస్తూ తల్లిదండ్రులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాయని వారు మండిపడ్డారు.

ఈ ఏడాది ఫిబ్రవరిలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఫీజుల నియంత్రణకు కఠిన నిబంధనలు రూపొందించాలని అధికారులను ఆదేశించినప్పటికీ, ఇంతవరకు సమగ్ర చట్టం కార్యరూపం దాల్చలేదు. ప్రభుత్వ జాప్యాన్ని ఆసరాగా చేసుకుని యాజమాన్యాలు ఫీజుల భారం మోపుతున్నాయని, ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పటిష్ఠమైన చట్టాన్ని అమలు చేయాలని తల్లిదండ్రుల సంఘాలు, విద్యార్థి సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

## కేంద్ర జలశక్తి మంత్రితో పవన్ భేటీ.. 'సూరత్ నమూనా'పై కీలక చర్చ!

- మొదటి పేజి తరువాయి

నదుల పరిరక్షణ, జల్ జీవన్ మిషన్ అమలు వంటి కీలక అంశాలపై ఇరువురు నేతలు సుదీర్ఘంగా చర్చించారు. ఏపీలోని కొన్ని ప్రాంతాల్లో ఇంకా నీటి కొరత తీరలేదని పవన్ కల్యాణ్ కేంద్రమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ప్రజలకు స్థిరమైన తాగునీటి సరఫరా అందించడానికి గుజరాత్‌లోని 'సూరత్ నమూనా'ను అధ్యయనం చేయాలని అధికారులకు పవన్ సూచించారు. సూరత్‌లో పారిశ్రామిక వ్యర్థ జలాలను శుద్ధి చేసి మళ్లీ ఎలా విజయవంతంగా వినియోగిస్తున్నారో, అదే విధానాన్ని ఆంధ్రప్రదేశ్‌లో కూడా అమలు చేసే అవకాశాలను పరిశీలించాలని అన్నారు.

గోదావరి పుష్కరాలు సమీపిస్తున్న నేపథ్యంలో నదీ జలాల స్వచ్ఛతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని పవన్ స్పష్టం చేశారు. పారిశ్రామిక కాలుష్యం వల్ల ఏపీలోని నదులు, జలవనరులు దారుణంగా దెబ్బతింటున్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. పరిశ్రమలు వదిలే వ్యర్థాల వల్ల నదులు కలుషితం కాకుండా 'జీరో లిక్విడ్ డిశ్చార్జ్' విధానాన్ని కఠినంగా అమలు చేయాలని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులకు స్పష్టం చేశారు.

## దక్షిణ కోస్తాంధ్ర వరకు విస్తరించిన ద్రోణి

- మొదటి పేజి తరువాయి

కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు, మార్కాపురం, ప్రకాశం, నెల్లూరు, తిరుపతి జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వార్షలు కురిసే అవకాశం ఉంది. మిగతా జిల్లాలో అక్కడక్కడ పిడుగులతో కూడిన తేలికపాటి వర్షాలు కురుస్తాయి. మరోవైపు ఎండ ప్రభావం చూపే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. గుండె సంబంధిత వ్యాధులు, మధుమేహం, రక్తపోటు ఉన్నవారు ఎండలో తిరగరాదు' అని సూచించింది.

## నీట్ రీ-ఎగ్జామ్ నేపథ్యంలో టెలిగ్రామ్‌పై తాత్కాలిక నిషేధం

- మొదటి పేజి తరువాయి

టెలిగ్రామ్ సీఈఓ పావెల్ దురోవ్ స్పందించారు. కొందరు చేసే తప్పులకు భారత్‌లోని 150 మిలియన్ల మంది సాధారణ వినియోగదారులను శిక్షించడం సమంజసం కాదని ఆయన 'ఎక్స్' వేదికగా విమర్శించారు. ఈ నిషేధం వల్ల ఆశించిన ప్రయోజనం ఉండదని, లీకేజీలకు పాల్పడేవారు ఇతర ప్రత్యామ్నాయ మార్గాలను ఆశ్రయిస్తారని ఆయన అభిప్రాయపడ్డారు.కాగా, ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా గూగుల్ ఇప్పటికే తన ప్లే స్టోర్ నుంచి టెలిగ్రామ్‌ను తొలగించగా, యాపిల్ కూడా త్వరలోనే ఈ దిశగా చర్యలు తీసుకోనుంది.నీట్ పునఃపరీక్ష నేపథ్యంలో కొందరు కేటుగాళ్లు టెలిగ్రామ్ ఛానెళ్ల వేదికగా నకిలీ ప్రశ్నపత్రాలు విక్రయిస్తామంటూ తప్పుడు ప్రచారం చేస్తున్నారు. పాత మెసేజ్‌లను ఎడిట్ చేస్తూ ప్రశ్నాపత్రాలు లీకైనట్లు నకిలీ ఆధారాలను సృష్టిస్తూ విద్యార్థులను, వారి తల్లిదండ్రులను మానసిక ఆందోళనకు గురిచేస్తున్నారు. ఈ తరహా మోసాలకు అడ్డుకట్ట వేసేందుకే ప్రభుత్వం ఈ యాప్‌పై తాత్కాలిక ఆంక్షలు విధించింది. అంతేకాకుండా, జూన్ 30 వరకు టెలిగ్రామ్‌లో మెసేజ్ ఎడిటింగ్ ఫీచర్‌ను కూడా నిలిపివేశారు.

## ఫ్రాన్స్‌లో జీ7 సదస్సు.. కరచాలనం చేసుకున్న మోదీ, ట్రంప్

- మొదటి పేజి తరువాయి

వివిధ అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పరస్పరం కరచాలనం చేసుకుని, ప్రత్యేకంగా చర్చించుకోవడం విశేషం.ఈ సదస్సులో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మాట్లాడుతూ, రష్యా చమురుపై త్వరలోనే అమెరికా మళ్లీ ఆంక్షలు విధించే అవకాశం ఉందని సంచలన ప్రకటన చేశారు. ఇరాన్‌తో ఇటీవలే కుదిరిన ఒప్పందం కారణంగా హర్మూజ్ జలసంధి గుండా చమురు సరఫరా సులభతరమైందని, ఇది రష్యాపై కఠిన చర్యలు తీసుకునేందుకు వీలు కల్పిస్తుందని ఆయన వివరించారు. ఉక్రెయిన్‌పై దాడి నేపథ్యంలో మాస్కోపై ఆర్థిక ఒత్తిడిని మరింత పెంచేందుకు జీ7 దేశాలు కొత్త మార్గాలను అన్వేషిస్తున్న తరుణంలో ట్రంప్ చేసిన ఈ వ్యాఖ్యలు అంతర్జాతీయంగా ప్రాధాన్యత సంతరించుకున్నాయి.సాధారణంగా జీ7 సభ్య దేశాలు, తాము ఆహ్వానించిన ఇతర దేశాల అధినేతలు, అంతర్జాతీయ సంస్థల ప్రతినిధులతో కలిసి ఈ ఔట్‌రీచ్ సెషన్‌ను నిర్వహిస్తాయి. ప్రపంచం ఎదుర్కొంటున్న కీలక ఆర్థిక, రాజకీయ సవాళ్లపై విస్తృతంగా చర్చించి, సరైన పరిష్కార మార్గాలను కనుగొనడమే ఈ సమావేశం ప్రధాన ఉద్దేశం.

## కాంగ్రెస్ వైఖరిపై బండి సంజయ్ నిప్పులు.. తెలంగాణకు రూ. 10 లక్షల కోట్లు కేటాయించామని వెల్లడి

- మొదటి పేజి తరువాయి

కట్టుబడి ఉంటుందని కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ స్పష్టం చేశారు. కరీంనగర్ జిల్లా మానకొండూరులో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.దేశంలోకి అక్రమంగా చొరబడిన వలసదారుల గురించి కాంగ్రెస్ ఎందుకు మౌనంగా ఉందో సమాధానం చెప్పాలని బండి సంజయ్ డిమాండ్ చేశారు. అక్రమ వలసదారులతో ఇక్కడి ముస్లిం సమాజాన్ని పోల్చడం ద్వారా కాంగ్రెస్ వారిని అవమానిస్తోందని, తక్షణమే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.గత పన్నెండేళ్లలో తెలంగాణ అభివృద్ధి, సంక్షేమం కోసం కేంద్రం ఏకంగా రూ. 10 లక్షల కోట్లు కేటాయించిందని వెల్లడించారు. హైదరాబాద్, వరంగల్, ఖమ్మం కార్పొరేషన్ల అభివృద్ధికి వేల కోట్లు ఇచ్చామన్నారు. రాష్ట్రం వేగంగా దూసుకుపోవాలంటే 'డబుల్ ఇంజన్ సర్కార్' రావాలని, ఈసారి ఒక్క అవకాశం బీజేపీకి ఇవ్వాలని ప్రజలను కోరారు.మావోయిస్టుల గురించి మాట్లాడుతూ... సమాజంలో తుపాకీ సంస్కృతి, మారణహోమంతో సాధించేది ఏమీ లేదన్నారు. ఏమీ తెలియని మైనర్ పిల్లల చేత తుపాకులు పట్టించడం అత్యంత దారుణమని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే చాలామంది మావోలు లొంగిపోయారని, ఇంకా ఆ ఆలోచనల్లో ఉన్నవారు భవిష్యత్తు కోసం మారాలని పిలుపునిచ్చారు.

పెన్ పవర్
ఉత్తరాంధ్ర
శ్రీకాకుళం। మన్యం। విజయనగరం। విశాఖపట్నం । అనకాపల్లి। అల్లూరి జిల్లా



# రైతన్న వెన్నంటే కూటమి ప్రభుత్వం.

## లోతుగడ్డలో విత్తనాల పంపిణీ కార్యక్రమం.

**చింతపల్లి పెన్ పవర్ జూన్ 16.** వ్యవసాయాన్ని పండుగ చేసే దిశగా, రైతన్నకు అడుగడుగునా అండగా నిలవడమే లక్ష్యంగా రాష్ట్రంలోని ఎన్డీయే కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోందని లోతుగడ్డ మాజీ సర్పంచ్ చింతర్ల సునీల్ కుమార్ అన్నారు. సకాలంలో రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించాలన్న ప్రభుత్వ ఆశయ సాధనలో భాగంగా లోతుగడ్డ పంచాయతీలో విత్తనాల పంపిణీ కార్యక్రమం పండుగ వాతావరణంలో జరిగింది. గ్రామ సచివాలయ అగ్రికల్చర్ అసిస్టెంట్ ఎల్. శేషు ఆధ్వర్యంలో మంగళవారం ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి టీడీపీ సీనియర్ నాయకులు, లోతుగడ్డ మాజీ సర్పంచ్ సునీల్ కుమార్ ముఖ్య అతిథిగా విచ్చేసి పంపిణీని లాంఛనంగా ప్రారంభించారు.
అన్నదాతలు ఆర్థికంగా ఎదగాలన్నదే ఎన్డీయే కూటమి ప్రభుత్వ ప్రధాన ఉద్దేశమని, అందులో భాగంగానే పెట్టుబడి భారాన్ని తగ్గించి దిగుబడిని పెంచే అత్యుత్తమ నాణ్యమైన విత్తనాలను రైతులకు చేరువ చేస్తున్నామని ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ సునీల్ కుమార్ స్పష్టం చేశారు. గతంలోలా విత్తనాల కోసం రైతులు పడిగాపులు కాసే పరిస్థితి లేకుండా, నేరుగా గ్రామ సచివాలయాల ద్వారా పారదర్శకంగా పంపిణీ చేపడుతున్నామని నాయకులు వివరించారు. సచివాలయ వ్యవసాయ సహాయకుడు శేషు పర్యవేక్షణలో రైతులందరికీ ఎటువంటి ఇబ్బందులు కలగకుండా, పకడ్బందీగా ఈ విత్తనాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో మూడు పార్టీలకు చెందిన కూటమి నాయకులు పూర్తి సమన్వయంతో పాల్గొని ప్రభుత్వ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. జనసేన నాయకులు మఠ్రి మనోహర్, దేపురం రాజు, బీజేపీ జనరల్ సెక్రెటరీ వంతల మహేష్, బీజేపీ కిసాన్ మోర్చా జనరల్ సెక్రెటరీ పాంగి రాజుబాబు, అలాగే టీడీపీ ఉపాధ్యక్షులు వంతల రాంబాబు, టీడీపీ బూత్ ఇన్‌ఛార్జి తగ్గి రాఘవులు తదితరులు ఈ కార్యక్రమంలో చురుగ్గా పాలుపంచుకున్నారు. ఏ ఒక్క రైతూ ఇబ్బంది పడకూడదన్న ప్రభుత్వ లక్ష్యాన్ని నెరవేర్చేలా అధికార యంత్రాంగానికి వీరంతా అండగా నిలిచారు. సకాలంలో అడిగిన వెంటనే విత్తనాలు అందడంతో లోతుగడ్డ పంచాయతీ పరిధిలోని రైతాంగం కూటమి ప్రభుత్వంపై హర్షం వ్యక్తం చేస్తోంది.

# తాజంగి గిరిజన మ్యూజియం పనులను త్వరితగతిన పూర్తి చేయాలి.



- నాణ్యత, భద్రతలో విషయం లో రాజీ పడవ ద్దు.
- క్షేత్రస్థాయిలో పనులు పరిశీలించిన కేంద్ర, రాష్ట్ర ఉన్నతాధికారులు.

**చింతపల్లి పెన్ పవర్ జూన్ 16.** అల్లూరి సీతారామరాజు జిల్లా చింతపల్లి మండలం తాజంగిలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న గిరిజన స్వాతంత్ర్య సమరయోధుల మ్యూజియం పనులను మరింత వేగవంతం చేయాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. మంగళవారం కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ డైరెక్టర్ దీపాలి మాసిర్కర్, రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి ఎం.ఎం.నాయక్ నేతృత్వంలోని అధికారుల బృందం నిర్మాణ పనులను క్షేత్రస్థాయిలో విస్తృతంగా తనిఖీ చేసింది. పాడేరు ఐటీడీఏ పీవో ఆదిత్య వర్మ, టీసీఆర్ అండ్ టీఎం మిషన్ డైరెక్టర్ డాక్టర్ మంధా రాణి, చీఫ్ ఇంజనీర్‌తో కలిసి భవన నమూనాలు, అంతర్గత లేఅవుట్లను వారు నిశితంగా పరిశీలించారు. అనంతరం పనుల పురోగతిపై ఇంజనీరింగ్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ?మ్యూజియంకు ప్రధాన ఆకర్షణగా నిలవనున్న భారీ డోమ్ పెయింటింగ్ పనుల పట్ల అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలని అధికారుల బృందం ఈ సందర్భంగా సూచించింది. డోమ్ ఎత్తులో ఉన్నందున కింది నుంచి పటిష్టమైన స్కాఫోల్డింగ్ ఏర్పాటు చేయాలని, కార్మికుల భద్రతా ప్రమాణాలను కచ్చితంగా పాటిస్తూ పనులు పూర్తి చేయాలని స్పష్టం చేసింది. వర్షాలు, ప్రతికూల వాతావరణ పరిస్థితుల వల్ల నిర్మాణ పనులకు ఎలాంటి ఆటంకం కలగకుండా ముందస్తు చర్యలుగా తాత్కాలిక షెడ్లు నిర్మించుకోవాలని సూచించింది. భవన నిర్మాణంలో ఎక్కడైనా చిన్నపాటి లోపాలు, అసమానతలు ఉంటే వెంటనే సరిదిద్దాలని, నాణ్యత విషయంలో ఎక్కడా రాజీ పడకూడదని అధికారులకు తేల్చిచెప్పింది. ?గిరిజన వీరుల అపూర్వ చరిత్ర, సంస్కృతి, సాంప్రదాయాలు భావితరాలకు కళ్లకు కట్టినట్లు తెలిసేలా మ్యూజియం ప్రదర్శన గ్యాలరీలను అంతర్జాతీయ ప్రమాణాలతో తీర్చిదిద్దాలని క్యురేటెడ్ బృందానికి ఉన్నతాధికారులు సూచించారు. ఈ పర్యటనలో భాగంగా అధికారుల బృందం చింతపల్లిలోని కాఫీ పల్పింగ్ యూనిట్ పనులను పరిశీలించింది. అలాగే జీ.మాడుగులలో కొత్తగా నిర్మించనున్న కాఫీ పల్పింగ్ యూనిట్ స్థలాన్ని సైతం సందర్శించి భవిష్యత్ ప్రణాళికలను అంచనా వేసింది. ఈ కార్యక్రమంలో టీఎఫ్ఎఫ్ఎం ప్రత్యేక బృందం, అరకు, పాడేరు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, చింతపల్లి డీఈఈ, ఏఈ, క్యురేటెడ్ బృందం సభ్యులు, నిర్మాణ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

### సీలేరు పాఠశాలకు

# నూతన వసతి భవనం మంజూరు

## పీఎం జన్మన్ నిధులతో నిర్మాణ పనులకు స్థల పరిశీలన

**సీలేరు,పెన్ పవర్,జూన్ 16:** అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెంకొత్తవీధి మండలం సీలేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు పీఎం జన్మన్ నిధులతో మంజూరైన వసతి భవనం నిర్మాణం కోసం ఏపీడబ్ల్యూఐడీసీ డీఈ జి.జె. ప్రసాద్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నాగభూషణం, కూటమి నాయకులతో కలిసి మంగళవారం స్థల పరిశీలన నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈ జి.జె. ప్రసాద్ విలేకరులతో మాట్లాడుతూ, పీఎం జన్మన్ నిధుల ద్వారా విద్యార్థుల వసతి సౌకర్యాల కోసం సీలేరు ప్రాంతానికి రెండు భవనాలు మంజూరయ్యాయని తెలిపారు. వాటిలో ఒకటి ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలకు, మరొకటి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు మంజూరైనట్లు చెప్పారు. ఏడాది క్రితమే భవనాలు మంజూరైనప్పటికీ సీలేరు ప్రాంతంలో స్థల సమస్య కారణంగా నిర్మాణ పనులు ఆలస్యమయ్యాయని పేర్కొన్నారు. స్థానిక నాయకులు, పాఠశాల సిబ్బంది సహకారంతో జెన్‌కో అధికారులు స్థలం కేటాయించడంతో ఇటీవలే బాలికల ఆశ్రమ పాఠశాలలో నిర్మాణ పనులు ప్రారంభించినట్లు తెలిపారు. అదేవిధంగా సీలేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలోని ఖాళీ స్థలంలో వసతి భవనం నిర్మాణానికి స్థల పరిశీలన చేపట్టామని చెప్పారు. జిల్లా పరిషత్ పాఠశాలలో స్థలం పరిమితంగా ఉండటంతో జీం2 నమూనాలో భవనం నిర్మిస్తున్నామని, బాలికల ఆశ్రమ పాఠశాలలో స్థలం ఎక్కువగా ఉండటంతో జీం1 నమూనాలో నిర్మాణం చేపడుతున్నామని వివరించారు. ప్రతి భవనం అంచనా వ్యయం రూ. 2.70 కోట్లు కాగా, జిల్లాలో గూడెంకొత్తవీధి మండలం సప్పర్ల, చింతపల్లి మండలం వంగసార, లంబసింగి, కొయ్యూరు మండలం రాజేంద్రపాలెం ప్రాంతాల్లో కూడా పీఎం జన్మన్ నిధులతో వసతి భవనాల నిర్మాణాలు కొనసాగుతున్నాయని తెలిపారు. వంగసార, లంబసింగి ప్రాంతాల్లో మొదటి అంతస్తు స్లాబ్ పనులు జరుగుతున్నాయని పేర్కొన్నారు. అనంతరం స్థానిక కూటమి నాయకులతో కలిసి బాలికల ఆశ్రమ పాఠశాలలో నిర్మాణంలో ఉన్న వసతి భవన పనులను పరిశీలించారు. నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని, స్థానికంగా లభించే నాసిరకం ఇసుకను వినియోగించరాదని కాంట్రాక్టర్‌కు డీఈ సూచించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు చిటికెల రాము, బొర్రా కృష్ణ, బాలకృష్ణ, ఎం. రమణ, పిలోన్, లక్షణ్, బీజేపీ ఓబీసీ మండల అధ్యక్షుడు మారిబాబు, జేఈ గోపీ, బాలికల ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పి. నాగశకుంతల తదితరులు పాల్గొన్నారు.



# ప్రతిపక్షాలపై కక్షసాధింపు మాని అభివృద్ధిపై దృష్టి పెట్టండి.

- కూటమి ప్రభుత్వానికి
- అరకు ఎంపీ గుమ్మా తనూజా రాణి ధ్వజం.



**చింతపల్లి పెన్ పవర్ జూన్ 16.** రాష్ట్రంలో మహిళల భద్రతను గాలికి వదిలేసిన కూటమి ప్రభుత్వం, ప్రతిపక్షాలపై కక్షసాధింపు చర్యలకే ప్రాధాన్యత ఇస్తోందని అరకు పార్లమెంట్ సభ్యురాలు గుమ్మా తనూజా రాణి ధ్వజమెత్తారు. తన పర్యటనలో భాగంగా ఎంపీ నిధులతో నిర్మిస్తున్న చింతపల్లి కళ్యాణ మండప పనులను ఆమె పరిశీలించారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించి, మీడియాతో మాట్లాడారు. మాజీ మంత్రి అమర్‌నాథ్ చేసిన వ్యాఖ్యలపై అధికార పార్టీ నేతలు, మంత్రులు అనవసర రాద్ధాంతం చేస్తున్నారని ఎంపీ మండిపడ్డారు. ఆయన చేసిన వ్యాఖ్యలు కేవలం హోంమంత్రి అనితను ఉద్దేశించినవే తప్ప, యావత్ మహిళా లోకాన్ని కించపరిచేలా లేవని ఆమె స్పష్టం చేశారు. ఒక ఉపాధ్యాయురాలి స్థాయి నుంచి హోంమంత్రి స్థాయికి ఎదిగిన అనిత, ఏనాడైనా యువత లేదా రాష్ట్ర ప్రజల సమస్యలపై స్పందించారా అని ప్రశ్నించారు. గత కొంతకాలంగా ప్రతిపక్ష నాయకులపై, ముఖ్యంగా మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డిపై అధికార పార్టీ నాయకులు ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. కోట్లాది మంది అభిమానులు ఉన్న ఒక మాజీ ముఖ్యమంత్రిని ఏకవచనంతో పిలవడం, "పులివెందుల ఎమ్మెల్యే" అంటూ కించపరిచేలా మాట్లాడటం సరికాదన్నారు. వైఎస్ జగన్ కుటుంబ సభ్యులను, ఇంట్లోని మహిళలను సైతం గతంలో అధికార పార్టీ నేతలు విమర్శించినప్పుడు, నేడు మాట్లాడుతున్న టీడీపీ మహిళా నాయకులు నాడు ఎందుకు స్పందించలేదని సూటిగా ప్రశ్నించారు. రాష్ట్రంలో ప్రభుత్వం పట్ల ప్రజల్లో వ్యతిరేకత మొదలైందని, ఇటీవల ప్రతిపక్షాలు చేపట్టిన కార్యక్రమాలు విజయవంతం కావడాన్ని జీర్ణించుకోలేక, ప్రజల దృష్టిని మళ్లించడానికే అమర్‌నాథ్ వ్యాఖ్యలను బూతద్దంలో చూపిస్తూ అధికార పార్టీ 'డైవర్షన్ పాలిటిక్స్' చేస్తోందని ఎంపీ ఆరోపించారు. రాష్ట్రంలో ప్రతిపక్ష నాయకులు, కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయించడం, బెదిరింపులకు గురిచేయడం పరిపాటిగా మారిందన్నారు. రాష్ట్రంలో మహిళలు, బాలికల భద్రత పట్ల ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆవేదన వ్యక్తం చేశారు. కాకినాడలో ఒక చిన్నారి అదృశ్యమైనా హోంమంత్రి ఎందుకు స్పందించలేదని నిలదీశారు. గతంలో రాష్ట్రం నుంచి 30 వేల మంది మహిళలు అదృశ్యమయ్యారని ఆరోపించిన నాయకులు, ఇప్పుడు అధికారంలో ఉండి ఆ విషయంపై ఎందుకు నోరు మెదపడం లేదన్నారు. పార్వతీపురం మన్యం జిల్లా, పాలకొండ నియోజకవర్గంలో ఒక గిరిజన యువతి అత్యంత దారుణంగా హత్యకు గురైతే ప్రభుత్వం నుంచి కనీస స్పందన కరువైందని విమర్శించారు. రాష్ట్రంలో ఎంతో మంది మహిళలపై దాడులు, వేధింపులు జరుగుతున్నా పట్టించుకోని ప్రభుత్వం, కేవలం ఒక 'మేకప్' వ్యాఖ్యపై మాత్రం దిష్టిబొమ్మలు దహనం చేయడం, పోస్టర్లు చించివేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. రాష్ట్ర ప్రజలు అధికారం ఇచ్చింది రాష్ట్రాన్ని అభివృద్ధి చేయడానికి తప్ప, కక్షసాధింపు చర్యల కోసం కాదని ఎంపీ హితవు పలికారు. ముందుగా అన్యాయానికి గురైన మహిళలకు, అదృశ్యమైన చిన్నారి కుటుంబానికి, పాలకొండలో హత్యకు గురైన గిరిజన యువతి కుటుంబానికి హోంమంత్రి అనిత క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. ఆ కుటుంబాలకు క్షమాపణ చెప్పిన తర్వాతే, అమర్‌నాథ్ వ్యాఖ్యల గురించి మాట్లాడే లేదా ఇతరులను క్షమాపణ అడిగే అర్హత అధికార పార్టీకి ఉంటుందని ఆమె తేల్చి చెప్పారు. ఈ కార్యక్రమంలో చింతపల్లి, జికె వీధి ఎంపీపీలు కోరాబు అనూషా దేవి, బోయిన కుమారి, ఎంపీటీసీలు చిందాడ జయలక్ష్మి, దాసరి దారలక్ష్మి, వైకాపా మండల అధ్యక్షుడు పాంగి గణబాబు, నాయకులు పరమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


01
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసీఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
' ఐదు రోజులకు '
'4 సెం.మీ 4 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# ప్రభుత్వ అధికారుల్లారా చెరువును కాపాడండి...!



- ప్రభుత్వ చెరువును ఆక్రమించి లీజుకించి వ్యవసాయం చేసే వ్యక్తిపై చర్యలు తీసుకోవాలి.
- చీడిపాలెం మాజీ సర్పంచ్ సోమన్న దొర తహసిల్దార్ కు పిర్యాదు.

**కొయ్యూరు,పెన్ పవర్ జూన్ 16:** రెండు దశాబ్దాలుగా ప్రభుత్వానికి చెందిన 2 ఎకరాల 5 సెంట్లు ఉన్న రెవెన్యూ చెరువు ను సింగవరం కు చెందిన రైతు వ్యవసాయం చేయటమే కాక మరొకరికి లీజుకు ఇచ్చి వ్యవసాయం సాగుచేస్తున్న అతనిపై తక్షణ చర్యలను తీసుకోవాలంటూ చీడిపాలెం మాజీ సర్పంచ్ నత్తురూ సోమన్నదొర తహసీల్దార్ ప్రసాదరావు కు పిర్యాదు చేశారు. చెరువు ఆక్రమణ పై సోమన్న దొర వివరిస్తూ సింగవరం పంచాయితీ రెవెన్యూ విలేజ్ లో 37/5 సర్వే నంబర్ గల ప్రభుత్వ ఫోరంబోకు చెరువు 2 ఎకరాల 5 సెంట్లు చెరువు కబ్జా చేసిన జలుమూరి రాజేశ్వరమ్మ తనయుడైన గోవిందరావు గత రెండు దశాబ్దాలుగా వేరే వ్యక్తులకు కౌలు కుఇచ్చినట్లు తహసిల్దార్ కు ఇచ్చిన పిర్యాదు లో పేర్కొన్నారు. అంతేకాకుండా లీజుకిస్తూ మరి వ్యవసాయం సాగిస్తున్నట్టు పిర్యాదు లో తెలిపారు. దీనిపై గతంలో పాడేరు మీ కోసం కార్యక్రమంలో పిర్యాదు చేయగా సర్వే చేసి ప్రభుత్వ చెరువుగా పరిగణించి నిర్ధారించారు. ఇదే చెరువును తిరిగి ఆ జలుమూరు గోవిందరావు ఆ భూమిలో వ్యవసాయం చేయటం లీజుకి ఇవ్వటం చేస్తూ అనుభవిస్తున్నందున తహసిల్దార్ కు గ్రీవెన్స్ లో పిర్యాదు చేస్తున్నట్టు సోమన్న దొర ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ చెరువును కాపాడాలని ఆయన ఈ పిర్యాదు లో పేర్కొన్నారు.


ఇందు విషయమై శ్రీ గ్రామ రెవిన్యూ అధికారి,గ్రామ సర్వేయర్ మరియు మండల రెవిన్యూ ఇన్స్పెక్టర్ వారు దర్యాప్తు చేసి నివేదిక ఈ కార్యాలయమునకు సమర్పించియున్నారు. సదరు నివేదికలు ఆధారముగా ఫిర్యాదుదారుడు అయిన శ్రీ నత్తూరు సోమన్నదొర S/o వెంకటేశ్వర్లు పేర్కొనబడిన సర్వే నెం. 37/5 లో ఎ.2.05 సెంట్లు భూమిని రెవిన్యూ రికార్డ్స్ అయిన FMB పరిశీలించగా పెద్ద చెరువుగా నమోదైయున్నదని తెలియవచ్చినది.సింగవరం గ్రామస్తులు అయిన జనుమూరి రాజేశ్వరమ్మ W/o అప్పారావు గారు తేది.03.08.1995 దిన సదరు సర్వే నెం. 37/5 లో ఎ.2.05 సెంట్లు భూమికి D పట్టా పొందియున్నారని, శ్రీమతి జనుమూరి రాజేశ్వరమ్మ W/o అప్పారావు సదరు గ్రామము లో సర్వే నెం. 37/5 లో ఎ.2.05 సెంట్లు భూమికి పొందిన D ఫారం పట్టా సదరు ప్రభుత్వ నిబంధనలు అనుసరించి ప్రభుత్వ చెరువులో గల భూమికి D ఫారం పట్టా మంజూరు చేయుటకు కుదరదు కావున సదరు ఇది వరలో శ్రీమతి జనుమూరి రాజేశ్వరమ్మ W/o అప్పారావు పొందిన D ఫారం పట్టా నకిలీ పట్టాగా నిర్ధారణ చేయుడము జరిగినది కావున సదరు సర్వే నెం. 37/5 లో ఎ.2.05 సెంట్లు భూమికి D పట్టా ఇచ్చిన వివరాలు కొయ్యూరు తహసిల్దార్ వారి కార్యాలయంలో వున్నా రెవిన్యూ రికార్డ్స్ పరిశీలించగా ఎటువంటి ఆధారాలు లభ్యం కాలేదని ఈ ఎండార్సుమెంటు ద్వారా మీకు తెలియజేయడమైనది.

తహసిల్దార్,
కొయ్యూరు.

టు,
శ్రీ నత్తూరు సోమన్నదొర S/o వెంకటేశ్వర్లు ,
కాకరపాడు గ్రామము, చీడిపాలెం పంచాయతీ ,
కొయ్యూరు మండలము,A.S.R జిల్లా.

ఇందలి నకలు గౌరవ జిల్లా కలెక్టర్,ASR జిల్లా వారికి తగు సమాచారం నిమిత్తం పంపడమైనది.
ఇందలి నకలు గౌరవ సబ్ కలెక్టర్ ,పాడేరు వారికి తగు సమాచారం నిమిత్తం పంపడమైనది.

# దివ్యాంగులకు ఉచిత కృత్రిమ చేతుల పంపిణీ

- ‘చేయూత’ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి: కలెక్టర్ విజయకృష్ణన్



**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్ అనకాపల్లి, జూన్ 16 :** కృత్రిమ చేతులు అవసరమైన దివ్యాంగులు, ప్రమాద బాధితులు రాష్ట్రంలో నిర్వహించనున్న ‘చేయూత’ ఉచిత కృత్రిమ చేతుల పంపిణీ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ పిలుపునిచ్చారు. మంగళవారం జిల్లా కలెక్టరేట్‌లో ఈ శిబిరాలకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను ఆమె ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్ విజయనగరం జిల్లా రెడ్ క్రాస్ కమిటీ, రోటరీ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో ‘ఎల్.ఎన్.4 ప్రాజెక్టు’ కింద ఉచిత కృత్రిమ చేతుల పంపిణీ శిబిరాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలోని మూడు ప్రధాన కేంద్రాల్లో ఈ శిబిరాలు జరగనున్నాయని పేర్కొన్నారు.

వివరాల ప్రకారం ఆగస్టు 2న గుంటూరు జిల్లాలో, ఆగస్టు 23న విజయనగరం జిల్లాలో, సెప్టెంబర్ 6న అనంతపురం జిల్లాలో శిబిరాలు నిర్వహించనున్నారు. గుంటూరు, విజయనగరం, అనంతపురం జిల్లాల పరిధిలోని కృత్రిమ చేతులు అవసరమైన బాధితులు ఆయా శిబిరాలకు హాజరై ఉచితంగా కృత్రిమ చేతులను పొందవచ్చని తెలిపారు.

కార్యక్రమంలో అనకాపల్లి జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ పి.సురేష్, వైస్ చైర్మన్ పి.కృష్ణరాజు, కోశాధికారి రాజేశ్వర ప్రసాద్, కమిటీ సభ్యులు బి.గౌరీపతి మాస్టర్, పి.వీరభద్ర తదితరులు పాల్గొన్నారు.

# పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణపై రాజకీయ పార్టీలతో సమావేశం



**విశాఖ తూర్పు విశాఖపట్నం, జూన్ 16:** తూర్పు నియోజకవర్గ పరిధిలో పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ, ప్రత్యేక సంక్షిప్త సవరణ కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న డోర్ టు డోర్ పరిశీలన, వలసల నమోదుతో పాటు ఎన్నికల జాబితాల నవీకరణకు సంబంధించిన అంశాలపై ఎన్నికల గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో తూర్పు ఎన్నికల నమోదు అధికారి డి.ఎస్. సునీత సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఎన్నికల ప్రక్రియను పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించేందుకు రాజకీయ పార్టీల సహకారం అవసరమని ఆమె పేర్కొన్నారు. అలాగే పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ, ఓటర్ల జాబితా సవరణ, వలసల నమోదు తదితర అంశాలపై అధికారులకు వచ్చిన సూచనలు, అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుంటామని తెలిపారు.

ఈ సమావేశంలో రూరల్ ఎమ్మార్వో పాల్ కిరణ్, ఈఆర్వో గంగాధర్ రావు, డీఈఓ కార్యాలయానికి చెందిన చంద్రమౌళి, ఎన్నికల విధుల్లో ఉన్న యామిని పాల్గొన్నారు.

అలాగే వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు హాజరయ్యారు. 28వ వార్డు కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గుర్రం కనకారావు, జనసేన పార్టీ నుంచి రాజా రమేష్, టీడీపీ నుంచి ఎ. శివ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి కె. కామేష్, బీజేపీ నుంచి మురళీమోహన్ రావు తదితరులు సమావేశంలో పాల్గొని తమ అభిప్రాయాలు, సూచనలు వెల్లడించారు.

పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణతో పాటు ప్రత్యేక సంక్షిప్త సవరణ కార్యక్రమం విజయవంతం కావడానికి రాజకీయ పార్టీలు సహకరించాలని అధికారులు కోరారు.?

## హత్యకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలి.

- ఉషారాణిని హత్య చేసిన వారిని కఠినంగా శిక్షించాలి:ఏ.ఐ.డి డబ్ల్యు.ఏ.




**గుమ్మలక్ష్మీపురం జూన్ 16.పెన్ పవర్.** ఉషారాణిని ప్రేమ పేరుతో మోసం చేసి హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలంటూ అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం జిల్లా కార్యదర్శి లక్ష్మి ఆధ్వర్యంలో గుమ్మలక్ష్మీపురంలో మంగళవారం నిరసన చేపట్టారు.సీతంపేట మండలంకు చెందిన గిరిజన యువతి ఉషారాణి వారం రోజుల క్రితం హత్యకు గురైన విషయం తెలిసిందే.ఈ మేరకు ఎల్విన్ పేట జంక్షన్ వద్ద మానవహారం చేపట్టి యువతి కుటుంబానికి న్యాయం చేయాలంటూ నినాదాలు చేశారు.ఈ మేరకు ఏ.ఐ.డి.డబ్ల్యు.ఏ జిల్లా కార్యదర్శి లక్ష్మి మాట్లాడుతూ ఇలాంటి సంఘటనలు అమాయకులైన గిరిజన మహిళలపై పునరావృతం కాకూడదని ఇంతటి ఘోరానికి పాల్పడిన వాళ్లను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు.

# రెవెన్యూ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి

- జిల్లా కలెక్టర్‌కు ఏపీ రెవెన్యూ సర్వీసుల సంఘం విజ్ఞప్తి



**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్ శ్రీకాకుళం, జూన్ 16:** జిల్లాలోని అన్ని రెవెన్యూ కార్యాలయాల్లో జూన్ 20న నిర్వహించనున్న రెవెన్యూ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేలా చర్యలు చేపట్టాలని ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సర్వీసుల సంఘం ప్రతినిధులు జిల్లా కలెక్టర్‌ను కోరారు. ఉద్యోగులందరూ భాగస్వామ్యం కావడంతో పాటు ప్రజాప్రతినిధులు, ప్రజలు కూడా పాల్గొనే విధంగా కార్యక్రమాలను నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు.

ఈ సందర్భంగా తహసీల్దార్ల పదోన్నతుల విషయంలో సహకరించినందుకు సంఘం తరపున జిల్లా కలెక్టర్‌ను ఘనంగా సత్కరించారు. అనంతరం రెవెన్యూ శాఖకు సంబంధించిన పలు కీలక అంశాలపై సంఘ ప్రతినిధులు కలెక్టర్‌తో సుదీర్ఘంగా చర్చించారు.

ఉద్యోగులపై పెరుగుతున్న పనిభారాన్ని తగ్గించడం, ప్రభుత్వ ప్రాధాన్యతా క్రమంలో విధులను అమలు చేసేలా చర్యలు తీసుకోవడం, రోజువారీ పరిపాలనా కార్యకలాపాల నిర్వహణకు అవసరమైన బడ్జెట్ కేటాయించడం, కోర్టు కేసుల నిర్వహణకు ప్రత్యేక నిధులు మంజూరు చేయడం వంటి అంశాలను ప్రతిపాదించారు. అలాగే రీ-సర్వే కార్యక్రమం అమలులో ఎదురవుతున్న సమస్యలు, పీజీఆర్ఎస్ ఫిర్యాదుల పరిష్కారంలో ఎదురయ్యే ఇబ్బందులు, రీ-సర్వే ఉప తహసీల్దార్ పోస్టుల కొనసాగింపునకు ఉత్తర్వులు జారీ చేయడం, జూనియర్ సహాయకులు, గ్రామ రెవెన్యూ అధికారులకు సర్వే శిక్షణ కల్పించడం వంటి అంశాలను కూడా ప్రస్తావించారు.

ప్రతి నెల ఉద్యోగుల గ్రీవెన్స్ సమావేశం నిర్వహించడం, ప్రభుత్వం విడుదల చేసిన షెడ్యూల్ మేరకు ఉద్యోగ సంఘాలతో జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశాలు ఏర్పాటు చేయాలని కోరారు. ఈ అంశాలన్నింటిపైనా జిల్లా కలెక్టర్ సానుకూలంగా స్పందించినట్లు సంఘ ప్రతినిధులు తెలిపారు.

కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు బి.వి.వి.యెన్. రాజు, సహాధ్యక్షుడు ఎస్. గణపతిరావు, జిల్లా కార్యదర్శి డి. సోనికిరణ్, ఉపాధ్యక్షులు బి. గోపాలరావు, కె. అరుణ్ కుమార్, డి. పద్మావతి, స్పోర్ట్స్ అండ్ కల్చరల్ సెక్రటరీ ఐ. లింగరాజు, జాయింట్ సెక్రటరీలు ఎం. గౌరీశంకర్, కె. రాధిక, ఎగ్జిక్యూటివ్ మెంబర్ సి.హెచ్. దామోదరరావు, కలెక్టరేట్ సెక్రటరీ పి. పద్మావతి, శ్రీకాకుళం డివిజన్ అధ్యక్షుడు ఎస్. కిరణ్ కుమార్, డివిజన్ కార్యదర్శి డి. ప్రకాష్ రావు తదితరులు పాల్గొన్నారు.

# ఆరోగ్యకరమైన జీవనానికి యోగాసనాలు అత్యంత అవసరం







**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్ శ్రీకాకుళం, జూన్ 16 :** ఆరోగ్యకరమైన జీవనానికి యోగాసనాలు అత్యంత అవసరమని జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహమ్మద్ ఖాన్ పేర్కొన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా మంగళవారం శ్రీకాకుళం డచ్ భవనం వద్ద నిర్వహించిన పర్యాటక యోగాలో ఆయన పాల్గొని మాట్లాడారు.

వర్షం కురుస్తున్నప్పటికీ కార్యక్రమం నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు చేసిన అధికారులను ఆయన అభినందించారు. నేటి వేగవంతమైన జీవనశైలి, పెరుగుతున్న మానసిక ఒత్తిళ్ల కారణంగా అనేక ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని, వాటికి సహజసిద్ధమైన పరిష్కారం యోగానేనని అన్నారు. ప్రాచీన భారతదేశం ప్రపంచానికి అందించిన అమూల్యమైన వరం యోగాసనాలని పేర్కొన్నారు.

క్రమం తప్పకుండా యోగా చేయడం వల్ల శారీరక దృఢత్వంతో పాటు మానసిక ప్రశాంతత కూడా లభిస్తుందని తెలిపారు. ఆరోగ్యం బాగుంటేనే మన శరీరం, మనస్సు, జీవన విధానం చురుకుగా ఉంటాయని చెప్పారు. యువ వయసులో శరీరం అనేక విషయాలను తట్టుకోగలిగినా, వయసు పెరిగేకొద్దీ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ అవసరమని సూచించారు.

తాను కూడా గత రెండు నెలలుగా ప్రతిరోజూ వ్యాయామం చేస్తున్నట్లు వెల్లడించిన జాయింట్ కలెక్టర్, యోగా శరీరానికే కాకుండా మనస్సును కూడా చురుగ్గా ఉంచుతుందని అన్నారు. జూన్ 7 నుంచి ప్రారంభమైన యోగాంధ్ర కార్యక్రమం ప్రజల్లో ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అలవర్చేందుకు మంచి అవకాశమని పేర్కొన్నారు.

కార్గిల్ పార్క్‌లో ప్రతిరోజూ వివిధ శాఖల ఆధ్వర్యంలో యోగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, జూన్ 21 వరకు ఇవి కొనసాగుతాయని తెలిపారు. యోగా కేవలం యోగా దినోత్సవానికే పరిమితం కాకుండా జీవితాంతం కొనసాగించాలని ప్రజలను కోరారు. ప్రతిరోజూ 15 నుంచి 30 నిమిషాల పాటు ఏదైనా వ్యాయామం లేదా శారీరక కార్యకలాపం చేయడం ద్వారా జీవనశైలిలో గణనీయమైన మార్పు తీసుకురావచ్చని చెప్పారు.

ఈ సందర్భంగా జిల్లా ఆయుష్ అధికారి డాక్టర్ ఉత్తమ్ రాజ్ రాణా మాట్లాడుతూ యోగాసనాల వల్ల శరీరంలోని కండరాలు, కీళ్లు బలపడటంతో పాటు శరీరం మరింత సౌష్టవంగా మారుతుందని తెలిపారు. ప్రాణాయామం, ధ్యానం ద్వారా మానసిక ఒత్తిడి తగ్గి మెదడు ప్రశాంతంగా ఉంటుందని పేర్కొన్నారు.

కార్యక్రమంలో ఆర్డీఓ కె. సాయి ప్రత్యూష, డీఆర్డీఏ పీడీ కిరణ్ కుమార్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కె. అనిత, పర్యాటక అధికారి ఎన్. నారాయణరావు, మహిళా శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్టు అధికారి సువర్ణ, యోగా మాస్టర్ పాండ్రంకి మురళీకృష్ణ, యోగా ఇన్‌స్ట్రక్టర్లు, వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు, విద్యార్థులు, ప్రజలు పాల్గొన్నారు. కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు.

# ఈస్ట్ పాయింట్ గోల్ఫ్ క్లబ్‌లో భారీ యోగా కార్యక్రమం







## యోగా ప్రయోజనాలతో పాటు పర్యాటక విశిష్టతల ప్రచారమే లక్ష్యం

**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్ విశాఖపట్నం, జూన్ 16 :** అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న యోగాంధ్ర కార్యక్రమాల్లో భాగంగా మంగళవారం ముడసర్లోవలోని ఈస్ట్ పాయింట్ గోల్ఫ్ క్లబ్‌లో భారీ యోగా కార్యక్రమం నిర్వహించారు. యోగా ప్రాముఖ్యతను ప్రజల్లో చాటిచెప్పడంతో పాటు విశాఖ పర్యాటక విశిష్టతలను ప్రపంచానికి పరిచయం చేయాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని జిల్లా యంత్రాంగం నిర్వహించింది.

ఇప్పటికే రుషికొండ బీచ్, నావల్ డాక్‌యార్డ్ ప్రాంతాల్లో యోగా కార్యక్రమాలు నిర్వహించిన జిల్లా యంత్రాంగం, ఈసారి ఈస్ట్ పాయింట్ గోల్ఫ్ క్లబ్‌లో నిర్వహించిన కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. విశాఖపట్నం ఎంపీ శ్రీ భరత్, జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్, జాయింట్ కలెక్టర్ గొబ్బిళ్ల విద్యాధరి, జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్, ఏపీ ఆయిల్ అండ్ సీడ్స్ గ్రోవర్స్ కార్పొరేషన్ చైర్మన్ గండి బాబ్జీ, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సతీష్ కుమార్, జిల్లా అధికారులు, హోటల్స్ అసోసియేషన్ ప్రతినిధులు, గోల్ఫ్ క్లబ్ సభ్యులు, పర్యాటక రంగ ప్రముఖులు, విద్యార్థులు పాల్గొని యోగాసనాలు వేశారు.

అనంతరం యోగా గురువులకు, ప్రజ్ఞ యోగా ప్రదర్శించిన చిన్నారులకు ఎంపీ, కలెక్టర్ చేతుల మీదుగా జ్ఞాపికలు అందజేసి సత్కరించారు.

**21న జరిగే భారీ యోగా కార్యక్రమంలో అందరూ పాల్గొనాలి : కలెక్టర్**

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్న అతికొద్ది గోల్ఫ్ కోర్సుల్లో ఈస్ట్ పాయింట్ గోల్ఫ్ క్లబ్ ఒకటని, దేశంలోనే ప్రముఖ గోల్ఫ్ కోర్సులలో ఒకటిగా గుర్తింపు పొందుతోందన్నారు. ఈ పర్యాటక ప్రదేశాన్ని మరింతగా ప్రోత్సహించాలనే ఉద్దేశంతో యోగాంధ్ర కార్యక్రమాన్ని ఇక్కడ నిర్వహించినట్లు తెలిపారు.

గత ఏడాది అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా లక్షలాది మంది పాల్గొని గిన్నిస్ వరల్డ్ రికార్డు సాధించడం రాష్ట్రానికి గర్వకారణమన్నారు. ఈ నెల 21న విశాఖ బీచ్ రోడ్డులో వేలాది మంది ప్రజల భాగస్వామ్యంతో భారీ యోగా ప్రదర్శన నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ప్రతి ఒక్కరూ పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

**యోగా, పర్యాటక ప్రచారంలో మీడియా పాత్ర కీలకం : ఎంపీ భరత్**

విశాఖపట్నం ఎంపీ శ్రీ భరత్ మాట్లాడుతూ అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ఈస్ట్ పాయింట్ గోల్ఫ్ క్లబ్ వంటి అద్భుతమైన వేదికలో యోగా నిర్వహించడం ఆనందదాయకమన్నారు. యోగా ప్రయోజనాలను ప్రజలకు చేరవేయడంతో పాటు విశాఖపట్నంలోని ప్రముఖ పర్యాటక ప్రాంతాలను ప్రపంచానికి పరిచయం చేయడమే ఇటువంటి కార్యక్రమాల ప్రధాన ఉద్దేశమన్నారు.

ఈస్ట్ పాయింట్ గోల్ఫ్ క్లబ్ దేశంలోని అత్యుత్తమ 18 హోల్ గోల్ఫ్ కోర్సులలో ఒకటిగా అభివృద్ధి చెందిందని, అంతర్జాతీయ ప్రమాణాలతో క్లబ్ హౌస్ నిర్మాణం పూర్తయిందని తెలిపారు. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి గోల్ఫ్ క్రీడాకారులు ఇక్కడికి వస్తున్నారని, విశాఖ పర్యాటక ఆకర్షణను మరింత పెంచే సామర్థ్యం ఈ గోల్ఫ్ క్లబ్‌కు ఉందన్నారు. యోగా ప్రయోజనాలతో పాటు విశాఖ పర్యాటక విశిష్టతలను ప్రజలకు విస్తృతంగా తెలియజేయడంలో మీడియా కీలక పాత్ర పోషించాలని కోరారు.

ఈ కార్యక్రమంలో ఈస్ట్ పాయింట్ గోల్ఫ్ క్లబ్ సెక్రటరీ ఎస్‌వీఆర్ రాజు, వైస్ ప్రెసిడెంట్ టీఎస్ వర్మ, జనరల్ మేనేజర్ బ్రిగేడియర్ సత్య, లివింగ్ హార్ట్ స్కూల్‌కు చెందిన అరుణ కుమారి, డీఆర్డీఏ పీడీ, పర్యాటక శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# డేటా సెంటర్లపై దుష్ప్రచారాన్ని నమ్మొద్దు: ఎంపీ శ్రీభరత్



**బ్యూరో రిపోర్ట్ పెన్ పవర్ విశాఖపట్నం, జూన్ 16:**
విశాఖపట్నంలో ఏర్పాటు కానున్న డేటా సెంటర్లపై సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారం పూర్తిగా అవాస్తవమని, ప్రజల్లో అనవసర భయాందోళనలు సృష్టించే దుష్ప్రచారమని విశాఖపట్నం పార్లమెంట్ సభ్యుడు మతుకుమిల్లి శ్రీభరత్ పేర్కొన్నారు. మహా విశాఖ నగరపాలక సంస్థ కార్యాలయంలో కమిషనర్ కేతన్‌తో కలిసి నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.
డేటా సెంటర్ల ఏర్పాటు వల్ల విశాఖలో నీటి కొరత ఏర్పడుతుందని, పర్యావరణానికి తీవ్ర నష్టం జరుగుతుందనే ప్రచారం బాధ్యతారాహిత్యమని ఎంపీ అన్నారు. ప్రస్తుతం ఉన్న నీటి వనరులు, భవిష్యత్తులో అందుబాటులోకి రానున్న పోలవరం ప్రాజెక్ట్ జలాలు, ప్రతిపాదిత డీశాలినేషన్ ప్లాంట్లతో నగర భవిష్యత్తు అవసరాలకు మించి నీటి లభ్యత ఉంటుందని వివరించారు.
ప్రస్తుతం విశాఖ ప్రాంతంలో సుమారు 410 ఎంఎల్డీ నీటి సరఫరా జరుగుతోందని, భవిష్యత్తులో జనాభా, పరిశ్రమలు, డేటా సెంటర్లు, ఇతర మౌలిక వసతుల విస్తరణతో కలిపి గరిష్టంగా 1500 ఎంఎల్డీ అవసరం ఉండొచ్చని తెలిపారు. అయితే ఇప్పటికే ఉన్న మౌలిక సదుపాయాల ద్వారా 1243 ఎంఎల్డీ సామర్థ్యం ఉండగా, పోలవరం ప్రాజెక్ట్ ద్వారా అదనంగా 2110 ఎంఎల్డీ నీరు అందుబాటులోకి రానుందని వెల్లడించారు.
విద్యుత్ వినియోగంపై వస్తున్న విమర్శలు కూడా వాస్తవాలకు దూరంగా ఉన్నాయని శ్రీభరత్ పేర్కొన్నారు. డేటా సెంటర్ల వంటి హైటెక్ పరిశ్రమలు రాష్ట్రానికి భారీ పెట్టుబడులు, ఉపాధి అవకాశాలు, డిజిటల్ ఆర్థిక వ్యవస్థ అభివృద్ధికి దోహదపడతాయని చెప్పారు. రాబోయే సంవత్సరాల్లో రాష్ట్రంలో భారీ స్థాయిలో పునరుత్పాదక విద్యుత్ ఉత్పత్తి అందుబాటులోకి రానున్నందున విద్యుత్ సరఫరాపై ఎలాంటి ఆందోళన అవసరం లేదన్నారు.
డేటా సెంటర్లకు సంబంధించి పర్యావరణ అనుమతులు లేకుండానే పనులు చేపడుతున్నారన్న ప్రచారాన్ని కూడా ఆయన ఖండించారు. సంబంధిత ప్రాంతాలకు పర్యావరణ ప్రభావ అంచనా అనంతరం అన్ని చట్టబద్ధమైన అనుమతులు మంజూరయ్యాయని తెలిపారు. చెట్ల సంరక్షణ, ప్రత్యామ్నాయ వృక్షారోపణ, శబ్ద నియంత్రణ, ఉష్ణోగ్రత నిర్వహణ వంటి అన్ని ప్రమాణాలను కచ్చితంగా అమలు చేస్తామని స్పష్టం చేశారు.
డేటా సెంటర్ల ప్రాజెక్టుల్లో
గూగుల్ . కామ్
అదానీ.కామ్
ఎయిర్టెల్. కామ్
సంస్థల భాగస్వామ్యంపై జరుగుతున్న అపోహలను కూడా ఎంపీ నివృత్తి చేశారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, కంప్యూటింగ్ సామర్థ్యం, కృత్రిమ మేధస్సు సేవలు గూగుల్‌కు చెందినవని, మౌలిక వసతుల నిర్మాణం, నిర్వహణలో ఇతర భాగస్వామ్య సంస్థలు పనిచేస్తున్నాయని వివరించారు.
పర్యావరణ పరిరక్షణ పేరుతో కొందరు తప్పుడు ప్రచారాలు చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు చేస్తున్నారని, రాష్ట్రానికి పెట్టుబడులు, పరిశ్రమలు, ఉపాధి అవకాశాలు రాకుండా అడ్డుకునే ప్రయత్నాలను ప్రజలు గమనించాలని ఆయన కోరారు.
విశాఖపట్నాన్ని దేశంలోనే ప్రముఖ డిజిటల్, టెక్నాలజీ హబ్‌గా తీర్చిదిద్దేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయని, డేటా సెంటర్ల వంటి ప్రాజెక్టులు ఆ దిశగా కీలక మైలురాయిగా నిలుస్తాయని ఎంపీ శ్రీభరత్ పేర్కొన్నారు. వాస్తవాలను గుర్తించి అభివృద్ధికి సహకరించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.


02
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
శుభాకాంక్షలు యాడ్స్
కేవలం
యాడ్ 300/-
'పోస్టుకార్డు సైజు '
'పో. 12 సెం.మీ, వె.16 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి


## ఆంధ్ర యూనివర్సిటీ బోర్డ్ ఆఫ్ మెంబర్ గా లంబసింగి పర్యాటక మేనేజర్ సూరెడ్డి అప్పలనాయుడు.



**చింతపల్లి పెన్ పవర్ జూన్ 16.** ఆంధ్ర యూనివర్సిటీ బోర్డ్ ఆఫ్ మెంబర్ గా లంబసింగి పర్యాటక మేనేజర్ సూరెడ్డి అప్పలనాయుడును ఆంధ్ర యూనివర్సిటీ వీసి రాజశేఖర్ నియమించారు. ఏయు బోర్డ్ ఆఫ్ మెంబర్గా అప్పలనాయుడు మూడు సంవత్సరాల పాటు కొనసాగుతారని ఆదేశాలలో పేర్కొన్నారు. అప్పలనాయుడు గత 26 సంవత్సరాలుగా పర్యాటక శాఖలో రాష్ట్రంలో ప్రముఖ పర్యాటక ప్రాంతాల్లో మేనేజర్ గా పనిచేసారు. హిస్టరీ, ఆర్కియాలజీ విభాగానికి సంబంధించి ఈయన మూడు సంవత్సరాల పాటు కొనసాగుతారు. 2018 వ సంవత్సరంలో అప్పటి ముఖ్యమంత్రి చేతులు మీదుగా ఉత్తమ అవార్డును పొందారు. ఈ సందర్భంగా అప్పలనాయుడు మాట్లాడుతూ దాతల సహాయ సహకారాలతో సాన్ చారిటీ స్వచ్ఛంద సంస్థను నడుపుతూ గిరిజన మరియు మైదాన ప్రాంతాలలో ఉన్న యువతకు, పేద ప్రజలకు సేవా కార్యక్రమాలు చేస్తున్నామన్నారు. గత కొన్ని సంవత్సరాలుగా టూరిజం మరియు ఆర్కియాలజీ విభాగం ఏయు బోర్డ్ ఆఫ్ మెంబెర్ గా కొనసాగుతున్నా అన్నారు. రెండు విభాగాల విద్యార్థులకు స్వీయ అనుభవం సలహాలు అందిస్తానని అవి విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడతాయి అన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. ఎయు బోర్డ్ ఆఫ్ మెంబర్గా ఎంపికైన అప్పలనాయుడు పలువురు అభినందిస్తూ శుభాకాంక్షలు తెలియజేశారు.

## రాయితీపై గిరిజన రైతులకు విత్తనాల పంపిణీ

ప్రకృతి వ్యవసాయాన్ని విస్తృతంగా చేపట్టాలి.ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్.తోయక జగదీశ్వరి.



**గుమ్మలక్ష్మీపురం జూన్ 16 పెన్ పవర్.** మండలంలో గల స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం నాడు ప్రభుత్వ విప్,కురుపాం శాసనసభ్యురాలు తోయక జగదీశ్వరి చేతుల మీదుగా గుమ్మలక్ష్మీపురం,కురుపాం మండలాలకు చెందిన గిరిజన రైతులకు ఖరీఫ్ సీజన్‌కు అవసరమైన వరి,రాగులు,జొన్నలు తదితర విత్తనాలను 90 శాతం రాయితీపై పంపిణీ చేశారు.ఈ సందర్భంగా రైతులను ఉద్దేశించి ఎమ్మెల్యే మాట్లాడుతూ,ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో ఎల్‌నినో ప్రభావం అధికంగా ఉండే అవకాశం ఉన్నందున రైతులు స్వల్పకాలిక వరి రకాలు అయిన ఎంటీయూ-1121,ఆర్ఎన్ఆర్-15048,ఎన్ఎల్ఆర్-33349 వంటి రకాలను సాగు చేయాలని సూచించారు.వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని చిరుధాన్యాలైన కొర్రలు,జొన్నలు,రాగులను కూడా సాగు చేయడం ద్వారా మంచి దిగుబడులు పొందవచ్చని తెలిపారు.అలాగే రైతులు ప్రకృతి వ్యవసాయ పద్ధతులను మరింత విస్తృతంగా అనుసరించి తక్కువ ఖర్చుతో అధిక లాభాలు పొందాలని సూచించారు.రైతులకు అవసరమైన విత్తనాలు,వ్యవసాయ సలహాలు అందించేందుకు ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తోందని చెప్పారు.ఈ ఖరీఫ్ సీజన్‌కు కురుపాం మండలానికి 1,400 క్వింటాళ్ల వరి విత్తనాలు,గుమ్మలక్ష్మీపురం మండలానికి 1,580 క్వింటాళ్ల వరి విత్తనాలు కేటాయించినట్లు ఎమ్మెల్యే తెలిపారు.రైతుల అవసరాలను బట్టి అదనపు విత్తనాలను కూడా అందుబాటులోకి తీసుకువస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో కురుపాం వ్యవసాయ శాఖ అధికారి పి.నాగేశ్వరరావు గుమ్మలక్ష్మీపురం వ్యవసాయ శాఖ అధికారి పి.శంకరరావు,వ్యవసాయ శాఖ సిబ్బంది,రైతులు పాల్గొన్నారు.

# ఆదుకునే వారే లేరా ?

### సహాయం కోసం ఆర్తనాదం.

### ఆధార్, రేషన్ కార్డు లేక నిలిచిపోయిన వృద్ధాప్య పెన్షన్.

**అరకులోయ పెన్ పవర్ 16:** ఆధునిక డిజిటల్ యుగంలో ప్రభుత్వాలు అందిస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికి అందుతున్నాయని చెప్పినప్పటికీ, క్షేత్రస్థాయిలో మాత్రం కొందరు అత్యంత దయానయంగా మారింది. అరకులోయ మండలం లోతేరు పంచాయతీ పరిధిలో నివసిస్తున్న స్వాభి. పెంటమ్మ, వయస్సు(65) భర్త. (మోస్య, లేటు)ఒంటరి మహిళ పరిస్థితి దీనికి ప్రత్యేక ఉదాహరణగా నిలుస్తుంది. ఆమెకు అండగా నిలిచి కుటుంబ సభ్యులు ఎవరూ లేకపోవడంతో పూర్తిగా ఒంటరిగా జీవిస్తుంది. వయస్సు పై బడటంతో కనీసం శ్రమించి పనిచేసుకునే శక్తి కూడా లేదు. ఇటువంటి పరిస్థితులలో ప్రభుత్వ పింఛనే ఆమెకు ఏకైక జీవనాధారం కావాలి. కానీ, విధి వచించిన ఆమెను ప్రభుత్వ నిబంధనలు కుంగదీస్తున్నాయి. ఆమెకు కనీస గుర్తింపు కార్డు లేని ఆధార్ కార్డు కానీ, రేషన్ కార్డు, కానీ లేవు. ఈ సాంకేతిక కార్ల వల్ల ఆమెకు రావాల్సిన ప్రభుత్వం ఒంటరి మహిళ పెన్షన్ పూర్తిగా నిలిచిపోయింది. కడుపు నింపుకోవడానికి రేషన్ సరుకులు లేక చేతులు పింఛన్ డబ్బులు లేక ఆదరించే వారు కరువై ఆమె ప్రతిరోజు ఆకలితో అలమటిస్తుంది. అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి, మానవత దృక్పథంతో ప్రత్యేక చొరవ తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. తక్షణమే సదరు ఒంటరి మహిళక ఆధార్, రేషన్ కార్డులు మంజూరు చేసి, పింఛన్ వచ్చేలా చూడాలని, ఆమెను ఆకలి కోరల నుండి కాపాడాలని పంచాయతీ ప్రజలు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు.



## నేడు 1/70 చట్టంపై చింతపల్లి జెడ్పి గెస్ట్ హౌస్ లో అవగాహన సమావేశం ఏర్పాటు.







**చింతపల్లి పెన్ పవర్ జూన్ 16.** గిరి పుత్రులకు ఆయువు పట్టు వంటి 1/70 చట్టంపై అవగాహన సమావేశాన్ని స్థానిక జడ్పీ గెస్ట్ హౌస్ లో ఏర్పాటు చేసినట్లు చింతపల్లి జడ్పిటిసి పోతురాజు బాలయ్య, మాజీ సర్పంచ్ కంకిపాటి వీరన్నపడాల్ ( బాబులు), భారత్ ఆదివాసీ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మొట్టడం రాజబాబు తెలిపారు. మంగళవారం వారు మాట్లాడుతూ1/70 భూ బదలాయింపు చట్టాన్ని రద్దు చేయాలని 1700 మంది గిరిజనేతరులు సుప్రీంకోర్టులో పిటిషన్ వేసిన నేపథ్యంలో అత్యవసర సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది అన్నారు.1/70 చట్టం సవరణ గాని, రద్దు గాని చేయకుండా ఏ విధంగా న్యాయపోరాటం మరియు ప్రజా పోరాటం చేయాలని రాజకీయాలకతీతంగా అన్ని రాజకీయ పార్టీల నాయకులతో పాటు ఆదివాసి ప్రజా సంఘాలు, అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంఘం, విద్యార్థి సంఘాలు, మహిళా సంఘాలు, యువజన సంఘాలతో నేడు ( బుధవారం) చింతపల్లి జడ్పీ గెస్ట్ హౌస్ లో ఉదయం 10 గంటల నుండి సాయంత్రం నాలుగు గంటల వరకు సమావేశం ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ సమావేశానికి ప్రతి ఒక్క ఆదివాసీలు, ఆదివాసి అభిమానులు హాజరై అభిప్రాయాలను పంచుకోవాలని ఈ సందర్భంగా వారు కోరారు. ఇప్పటికే ఆదివాసీ గిరిజనులు ఎంతో ప్రతిష్టాత్మకమైన కొన్ని చట్టాలను కోల్పోవడం జరిగిందని, ఇకముందు అలా జరగకుండా ప్రతి ఒక్క గిరిజనుడు ఆలోచన విధానంతో కృషి చేయాలని కోరారు.

## విశ్రాంతి భవనం.చేతి పంపు మరమ్మతులు చేయండి.



**గుమ్మలక్ష్మీపురం జూన్ 16 పెన్ పవర్.** లోవముఠా ప్రయాణికుల విశ్రాంతి భవనం వద్ద చేతిపంపు మరమ్మతుల చేయండి.గుమ్మలక్ష్మీపురం మండలం లోవముఠా-బీరుపాడు జంక్షన్ వద్ద గల చేతిపంపు మరమ్మతులు చేపట్టి వినియోగంలోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు. ఈ మేరకు స్థానికులు మాట్లాడుతూ ఈ జంక్షన్ ఒడిస్సా ఆంధ్ర సరిహద్దు కావడంతో ప్రయాణికులతో నిత్యం రద్దీగా ఉంటుందని,అయితే చేతిపంపు తో పాటు ప్రయాణికులు విశ్రాంతి భవనం కూడా శిథిలావస్థకు చేరడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అధికారులు స్పందించి సమస్యలను పరిష్కరించాలని స్థానిక ప్రయాణికులు కోరుతున్నారు.

# కొత్తపల్లి జలపాతంలో యోగా కార్యక్రమానికి ఏర్పాట్లు

### స్థలాన్ని పరిశీలించిన ఐటీడీఏ, మండల అధికారులు

**జి.మాడుగుల.పెన్ పవర్.జూన్ (16)** మండలంలోని ప్రముఖ పర్యాటక ప్రాంతమైన కొత్తపల్లి జలపాతంలో యోగా కార్యక్రమం నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం ఐటీడీఏ, మండల అధికారులు కొత్తపల్లి జలపాతాన్ని సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. జలపాతం పరిసరాల్లో యోగా కార్యక్రమానికి అనుకూలమైన స్థలాన్ని గుర్తించి కేటాయించారు. కార్యక్రమం విజయవంతంగా నిర్వహించేందుకు అవసరమైన సౌకర్యాలు, భద్రతా చర్యలపై అధికారులు చర్చించారు. ఈ సందర్భంగా పర్యాటక ప్రాంతాల్లో ఆరోగ్యం, ఆధ్యాత్మికత, ప్రకృతి పరిరక్షణకు సంబంధించిన కార్యక్రమాలను ప్రోత్సహించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఏర్పాట్ల పరిశీలనలో ఐటీడీఏ ఏవో హేమలత, మండల స్థాయి అధికారులు, జలపాతం కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



# ఏకలవ్య ఎంట్రన్స్‌లో మెరిసిన దేవరాపల్లి విద్యార్థులు

**ఉపాధ్యాయులకు ఘన సన్మానం**



**గూడెంకొత్తవీధి,పెన్ పవర్,జూన్ 16:** ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్ (ఈఎంఆర్ఎస్ ) ప్రవేశ పరీక్షలో దేవరాపల్లి ఎంపీపీ పాఠశాల విద్యార్థులు విశేష ప్రతిభ కనబరిచారు. పాఠశాల నుంచి పరీక్షకు హాజరైన 15 మంది 5వ తరగతి విద్యార్థుల్లో 11 మంది ఉత్తీర్ణత సాధించి వివిధ ఏకలవ్య పాఠశాలల్లో ప్రవేశాలు పొందారు. రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ర్యాంకులు సాధించి జిల్లా ఖ్యాతిని పెంచారు. ఈ సందర్భంగా విద్యార్థులను, వారికి శిక్షణ అందించిన ప్రధానోపాధ్యాయుడు రామకృష్ణతో పాటు ఉపాధ్యాయులు శ్రీనివాస్, ప్రసాద్‌లను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి యూఏ నరసింహారావు, మాజీ సర్పంచ్ సిరిబాల బుజ్జిబాబు, భారత్ ఆదివాసీ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మొట్టడం రాజబాబు, మాజీ జెడ్పీటీసీ మచ్చల మత్స్యరాజు, టీడీపీ నేత మొట్టడం రామకృష్ణ, గ్రామ పెద్దలు, తల్లిదండ్రులు, గ్రామస్తులు పాల్గొన్నారు. అనంతరం విజేత విద్యార్థులకు మెడల్స్, ప్రశంసాపత్రాలు అందజేశారు. ఎంఈఓ నరసింహారావు మాట్లాడుతూ విద్యార్థులు, ఉపాధ్యాయులు సాధించిన విజయంపై అభినందనలు తెలియజేస్తూ భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. మాజీ సర్పంచ్ బుజ్జిబాబు దేవరాపల్లి గ్రామానికి మంచి పేరు తీసుకొచ్చిన విద్యార్థులను అభినందించారు. భారత్ ఆదివాసీ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మొట్టడం రాజబాబు మాట్లాడుతూ విద్యార్థుల విజయాల్లో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల పాత్ర కీలకమని పేర్కొన్నారు. ప్రధానోపాధ్యాయుడు రామకృష్ణ మాట్లాడుతూ గత ఏడాది 7 సీట్లు సాధించిన తమ పాఠశాల ఈసారి 11 సీట్లు సాధించడం ఆనందంగా ఉందని, ఉపాధ్యాయుల సమిష్టి కృషి ఫలితమే ఈ విజయం అని తెలిపారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో విద్యార్థులు, తల్లిదండ్రులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## రాజకీయాల్లో విమర్శలు విధానాలపై ఉండాలి

- వ్యక్తిగత దూషణలకు తావుండకూడదు...!
- టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, మాజీ జిసిసి చైర్మన్ ఎంవీవీ ప్రసాద్.



**కొయ్యూరు, పెన్ పవర్ జూన్ 16:** ప్రజాస్వామ్య వ్యవస్థలో రాజకీయ నాయకుల మధ్య భిన్నాభిప్రాయాలు సహజం, ప్రభుత్వ విధానాలు, నిర్ణయాలు, ప్రజా సమస్యలపై విమర్శలు చేయటం ప్రతి రాజకీయ నాయకుడి హక్కు..అయితే ఆ విమర్శలు వ్యక్తుల వ్యక్తిత్వం,కుటుంబం లేదా మహిళల కట్టుబొట్లు, వేషధారణ వంటి అంశాలను ప్రస్తావిస్తూ వ్యాఖ్యలు చేయటం కేవలం ఒక వ్యక్తిని మాత్రమే కాదు,సమాజంలోని మహిళల గౌరవాన్ని కించపర్చే చర్యగా భావించాల్సి ఉంటుందని ఎంవీవీ ప్రసాద్ అన్నారు. నేటి సమాజంలో ప్రజలు రాజకీయ నాయకుల ప్రతి మాటను, ప్రతి ప్రవర్తనను నిశితంగా గమనిస్తున్నారు. ప్రజా జీవితంలో ఉన్న నాయకులు తమ వ్యాఖ్యల ద్వారా సమాజానికి మంచి సందేశం ఇవ్వాల్సిన భాధ్యత కలిగి ఉండాలే తప్పా ఇలా చిల్లరగా మాట్లాడటం మంచి పద్ధతి కాదని ఎంవీవీ అన్నారు. రాజకీయ విభేదాలు ఎన్ని ఉన్నా పరస్పర గౌరవం,నమస్కారం మరియు హుందాతనం పాటించడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి అవసరం అని ఆయన పేర్కొన్నారు.

## అసంపూర్తిగా ఏకలవ్య పాఠశాల నిర్మాణం

- నిర్మాణాలు పూర్తి చెయ్యకపోతే ఆందోళనలు చేపడతాం
- తాత్కాలిక భవనంలో విద్యార్థుల అవస్థలు..
- అసలు నిర్మాణం పూర్తవుతుందా అని తల్లిదండ్రుల ఆవేదన



**జి.మాడుగుల. పెన్ పవర్.జూన్ (16)** గిరిజన విద్యార్థులకు మెరుగైన విద్య, వసతులు కల్పించాలనే లక్ష్యంతో చేపట్టిన ఏకలవ్య పాఠశాల నూతన భవన నిర్మాణ పనులు ఐదేళ్లుగా తూతూ మంత్రంగా కొనసాగుతూనే ఉండటంపై విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేశారు. జి.మాడుగుల ఏకలవ్య పాఠశాల వద్ద విద్యార్థుల తల్లిదండ్రులు నిరసన వ్యక్తం చేస్తూ, నిర్మాణ పనులు పూర్తి చేయడంలో అధికారులు నిర్లక్ష్యం కాంట్రాక్టర్లు తరచూ మారడం పాఠశాల భవనం అందుబాటులో లేకపోవడంతో ప్రస్తుతం స్థానిక గురుకుల పాఠశాల భవనంలో తాత్కాలికంగా తరగతులు నిర్వహిస్తున్నారు. జి.మాడుగుల ఏకలవ్య పాఠశాలలో సుమారు 400 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. తాత్కాలిక భవనంలో తరగతి గదులు, వసతి సౌకర్యాలు సరిపోక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తల్లిదండ్రులు తెలిపారు. వసతి గృహం, తరగతి గదులు ఒకే ప్రదేశంలో ఉండటంతో బాలురు, బాలికలు పలు సమస్యలు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు.

ఐదేళ్ల క్రితం ప్రారంభమైన నూతన భవన నిర్మాణం ఇప్పటికీ పూర్తికాకపోవడం బాధాకరమని అన్నారు. పలుమార్లు జిల్లా కలెక్టర్‌కు వినతులు అందించినా పనుల్లో ఆశించిన పురోగతి కనిపించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నిర్మాణ పనులను వేగవంతం చేసి నూతన విద్యా సంవత్సరంలో భవనం అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని, మరి కొద్ది రోజుల్లో పనులు పూర్తి చేయకపోతే ఆందోళన చేపడతామని తల్లిదండ్రులు పలాసి రాజు, కొండపల్లి లక్ష్మణరావు, జర్త మత్స్య కొండబాబు, పలాసి కొత్త నాయుడు, తల్లిదండ్రులు హెచ్చరించారు.

## కజ్జా పల్లి కాగులబండ రహదారి కి మోక్షం అటవీశాఖ జాయింట్ సర్వే



**జి మాడుగుల. పెన్ పవర్ జూన్(16)** ఎన్నో ఏళ్లుగా అటవీశాఖ సమస్యతో రహదారి నిర్మాణం జరగక ఇబ్బందులు పడుతున్న ఆ ప్రాంతం ప్రజలకు అటవి గిరిజన సంక్షేమ శాఖ ఉమ్మడి సర్వేతో మళ్ళీ వారిలో రహదారి నిర్మాణం పై ఆశలు చిగురుస్తున్నాయి. రహదారి నిర్మాణానికి నిధులు మంజూరైన అటవీ శాఖ అడ్డంకులతో ఆ రహదారి నిర్మాణ పనులు ఏళ్ల తరబడి ముందుకు సాగిన వైనం ఇది. అల్లూరి సీతారామరాజు జిల్లా జి.మాడుగుల మండలం వంతల పంచాయతీ కజ్జాపల్లి నుండి కాగుల బంధ వెళ్లే రహదారికి మంగళవారం నాడు అటవీ గిరిజన సంక్షేమ శాఖ సిబ్బంది స్థానిక ప్రజాప్రతినిధులు ఉమ్మడి సర్వే నిర్వహించారు. దీంతో ఎన్నో ఏళ్లుగా నిలిచిపోయిన రహదారి నిర్మాణ పనులు కు గ్రహణం వీడనుందని తమకు రహదారి సౌకర్యం కలిగి ఉందని ఈ ప్రాంతం ప్రజల ఆనంద వ్యక్తం అవుతుంది. మంగళవారం నాడు నిర్వహించిన సర్వేలో సర్పంచ్ మాజీ సర్పంచ్ గేమ్మెలి పద్మ కొండబాబు వంతల పంచాయతీ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు కృష్ణమూర్తి నాయుడు టిడిపి సీనియర్ నాయకులు సుందర రావు అటవీ సెక్షన్ ఆఫీసర్ బీట్ ఆఫీ ర్. ట్రైబల్ హెల్పర్ టి ఏ మాణిక్యం స్థానికులు పాల్గొన్నారు.

## రాజేంద్రపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లో యోగాంధ్ర...!



**కొయ్యూరు, పెన్ పవర్ జూన్ 16:** ఈనెల 21న జరగనున్న 12వ అంతర్జాతీయ యోగ దినోత్సవం పురస్కరించుకొని రాజేంద్రపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారులు జగదీష్ నాయక్, సందేశ్, సి హెచ్ ఓ ప్రశాంత్ కుమార్ ఆధ్వర్యంలో మంగళవారం వైద్య సిబ్బందికియోగ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు వైద్య సిబ్బందికి యోగ ప్రాముఖ్యత గురించి వివరించారు. యోగా ద్వారా మానసిక, శారీరక ఆరోగ్యం మెరుగుపడుతుందన్నారు. ప్రతి ఒక్కరూ కొన్ని నిమిషాలు యోగ గురించి కేటాయిస్తే బాగుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో పీహెచ్ఎన్ భాగ్యవతి, హెచ్ వి, లక్ష్మి, భూలోక, మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్స్, ఏఎన్ఎమ్స్, హెల్త్ అసిస్టెంట్,తదితరులు పాల్గొన్నారు.

## జీకే వీధి,ఏబులం,మొండిగెడ్డలలో ఆధార్ కేంద్రాలు అందుబాటులో ఉన్నాయి

**ఎంపీడీవో బిహెచ్వి రమణబాబు**



**గూడెంకొత్తవీధి,పెన్ పవర్,జూన్ 16:** అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెంకొత్తవీధి మండలంలోని ఏబులం, మొండిగడ్డ, గూడెంకొత్తవీధి గ్రామాల్లో ఆధార్ నమోదు కేంద్రాలు అందుబాటులో ఉన్నాయని మండల అభివృద్ధి అధికారి (ఎంపీడీవో) బి.హెచ్.వి. రమణబాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఆధార్ నమోదు, చిరునామా మార్పు, మొబైల్ నంబర్ అప్‌డేట్, ఇతర మార్పులు చేర్పులు అవసరమైన ప్రజలు సంబంధిత ఆధార్ కేంద్రాలను సందర్శించి సేవలను పొందాలని సూచించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో ఆధార్ కీలకమైనదని, అందువల్ల ప్రతి ఒక్కరూ ఆధార్ వివరాలు సక్రమంగా ఉండేలా చూసుకోవాలని కోరారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న "తల్లికి వందనం" పథకానికి సంబంధించి ఇంకా నమోదు చేసుకోని అర్హులైన లబ్ధిదారులు ఉంటే, వెంటనే తమ పరిధిలోని గ్రామ సచివాలయాన్ని సంప్రదించి నమోదు ప్రక్రియ పూర్తి చేసుకోవాలని ఎంపీడీవో విజ్ఞప్తి చేశారు. ప్రజలు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకొని ప్రభుత్వ సేవలు, సంక్షేమ పథకాల ప్రయోజనాలను పొందాలని ఆయన తెలిపారు.

# జీసీసీ వ్యాపార అభివృద్ధికి చర్యలు

- సీలేరు పెట్రోల్ బంక్, గ్యాస్ గోదాం తనిఖీ
- జీసీసీ డీఎం సింహాచలం



**సీలేరు, పెన్ పవర్,జూన్ 16:** గిరిజన సహకార సంస్థ (జీసీసీ) ద్వారా వ్యాపార కార్యకలాపాలను విస్తరించి ప్రజలకు మరింత చేరువయ్యేలా చర్యలు తీసుకుంటున్నట్లు చింతపల్లి జీసీసీ డివిజనల్ మేనేజర్ సింహాచలం తెలిపారు. మంగళవారం సీలేరు పర్యటన సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని పెట్రోల్ బంకులు, గ్యాస్ గోదాముల ద్వారా ప్రజలకు నిత్యావసర సేవలు అందిస్తున్నామని చెప్పారు. జీసీసీ వ్యాపార లక్ష్యాల సాధనలో భాగంగా ఆయా కేంద్రాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ అవసరమైన సూచనలు, సలహాలు అందిస్తున్నామని తెలిపారు. క్రయవిక్రయాల్లో పారదర్శకత ఉండేలా రికార్డులను పరిశీలిస్తున్నామని, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించకుండా సిబ్బందిని పర్యవేక్షిస్తున్నామని పేర్కొన్నారు. సీజన్‌ల వారీగా గిరిజనులు సేకరించే అటవీ ఫలసాయాలను గిట్టుబాటు ధరలకు కొనుగోలు చేస్తున్నామని, అక్టోబర్ నెల నుంచి తేనె సేకరణ కార్యక్రమానికి సన్నాహాలు చేస్తున్నామని వివరించారు. అలాగే చింతపల్లిలో జీసీసీ ఆధ్వర్యంలో సూపర్ బజార్ ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని, తక్కువ ధరలకు నిత్యావసర వస్తువులు అందించే విధంగా ఈ సూపర్ బజార్‌ను నిర్వహించనున్నట్లు తెలిపారు. దీని ద్వారా జీసీసీ సేవలు మరింత మంది గిరిజనులకు చేరువవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

**నిర్లక్ష్యం వహించిన ఉద్యోగి తొలగింపు:**
సీలేరు పెట్రోల్ బంకులో విధుల్లో నిర్లక్ష్యం వహించిన ఉద్యోగి శ్రీనివాసును విధుల నుంచి తొలగించినట్లు డీఎం సింహాచలం తెలిపారు. కేంద్ర ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా పెట్రోల్ విక్రయాలు జరపడంతో బంకుకు లాక్ పడిందని, దాదాపు 20 గంటలపాటు విక్రయాలు నిలిచిపోయాయని చెప్పారు. క్రమశిక్షణా చర్యల్లో భాగంగా సంబంధిత ఉద్యోగిపై చర్యలు తీసుకున్నామని, విధుల్లో నిర్లక్ష్యం వహించే వారిని ఉపేక్షించబోమని హెచ్చరించారు. అనంతరం సీలేరు పెట్రోల్ బంక్, గ్యాస్ గోదాంను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జీసీసీ బీఎం రాజబాబు, సిబ్బంది అయ్యప్ప, దశరథ్ తదితరులు పాల్గొన్నారు

## ఆర్‌వీ నగర్--పాలగడ్డ రహదారి పనులపై ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి

**ఆర్ అండ్ బి అధికారులను కోరిన డీసీసీ కార్యదర్శి కారె శ్రీనివాసు**



**సీలేరు,పెన్ పవర్, జూన్ 16:** అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెంకొత్తవీధి మండలం ఆర్‌వీ నగర్ నుంచి వై.రామవరం మండలం పాలగడ్డ వరకు ఉన్న అంతర్రాష్ట్ర రహదారి పనుల విషయంలో ఆర్ అండ్ బి అధికారులు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని డీసీసీ కార్యదర్శి కారె శ్రీనివాసు కోరారు. మంగళవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, ఈ ప్రాంతంలో పర్యటించిన ఆర్ అండ్ బి అధికారులు వర్షాకాలం ప్రారంభమయ్యేలోపు రహదారి పనులను పూర్తి చేస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. అయితే ఒక రీచ్‌లో మాత్రమే పనులు పూర్తి చేసి, మిగిలిన రెండు రీచ్‌ల పనులను పట్టించుకోకుండా వదిలేశారని విమర్శించారు. సుమారు 15 రోజుల క్రితం ఈ ప్రాంతంలో పర్యటించిన ఆర్ అండ్ బి ఈఈ, డీఈ, జేఈలు త్వరలోనే పనులు ప్రారంభిస్తామని ప్రకటించినప్పటికీ, ఇప్పటి వరకు ఎటువంటి పనులు చేపట్టలేదని ఆరోపించారు. ఇటీవల కురిసిన స్వల్ప వర్షాలకే రహదారి పెద్ద గుంతలతో దెబ్బతిందని, పూర్తిస్థాయిలో వర్షాలు ప్రారంభమైతే ప్రజల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ రహదారి పనులు త్వరితగతిన పూర్తి అయ్యేలా స్థానిక కూటమి నాయకులు చొరవ తీసుకుని అధికారులపై ఒత్తిడి తీసుకురావాలని కోరారు. ప్రజల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి రహదారి నిర్మాణ పనులను ప్రారంభించాలని కారె శ్రీనివాసు విజ్ఞప్తి చేశారు.

## రైతులకు వ్యవసాయ ఆధునిక పద్ధతులపై అవగాహన కార్యక్రమం




**గూడెం కొత్త వీధి,పెన్ పవర్, జూన్ 16:** అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెంకొత్తవీధి మండలం దుచ్చరపాలెం గ్రామంలో విలువ ఆధారిత నూనెగింజల క్లస్టర్ కార్యక్రమంలో భాగంగా రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సమగ్ర పంటల యాజమాన్యం, పోషక యాజమాన్య పద్ధతులపై రైతులకు వివరించారు. అలాగే సేంద్రియ వ్యవసాయ సాగులో భాగంగా పచ్చిరొట్ట పైరు సాగు, దాని వల్ల కలిగే ప్రయోజనాల గురించి రైతులకు అవగాహన కల్పించారు. ఎరువుల పంపిణీలో అమలవుతున్న నూతన విధానమైన ఏపీ ఏఐఎంఎస్ యాప్ ద్వారా పంపిణీ ప్రక్రియ, ఏపీ ఎఫ్ఆర్ తదితర వ్యవసాయ సంబంధిత అంశాలపై రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక వ్యవసాయ సహాయ సంచాలకులు బీవీ తిరుమలరావు, వ్యవసాయ అధికారి డి. గిరిబాబు, గ్రామ వ్యవసాయ సహాయకుడు సింహాచలం, ఆత్మ సిబ్బంది మహేశ్వరితో పాటు పలువురు రైతులు పాల్గొన్నారు. రైతులు ఆధునిక, సేంద్రియ వ్యవసాయ పద్ధతులను అవలంబించి అధిక దిగుబడులు సాధించాలని అధికారులు సూచించారు.

## 13 వ వార్డులో ఓటర్ జాబితా సవరణ ప్రక్రియ

- బిఎల్ఓలు బూత్ ఏజెంట్లు స్థానిక నాయకుల ఇంటింటి సర్వే
- ప్లే స్టోర్ ద్వారా ఈసిఐ నెట్ యాప్ డౌన్లోడ్తో ప్రక్రియ సులభతరం అవుతుంది
- వార్డు అధ్యక్షుడు ఏడువాక సన్యాసిరావు



**విశాఖ తూర్పు,పెన్ పవర్, జూన్ 16:** తూర్పు నియోజకవర్గ పరిధి13 వ వార్డు 21 బూత్ లలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ప్రక్రియలో భాగంగా బిఎల్వోలతో రాజకీయపార్టీల బిఎల్ఏ లు ప్రతిఇంటింటికి వెళ్లి ఓటర్లకు ఎన్యుమరేషన్ పత్రాలను అందించి ఓటర్ల నుండి సమగ్ర సమాచారంసేకరిస్తున్నామని, శాసనసభ్యులు వెలగపూడి రామకృష్ణ బాబు ఆదేశాలతో ప్రతి ఓటు కీలకమని బిఎల్ఏ లు అత్యంత కీలకంగా వ్యవహరించి సర్ ప్రక్రియలో పాల్గొని 2002 ఓటర్ లిస్టు ద్వారా మ్యాపింగ్ చేయాలని, ఆండ్రాయిడ్ మొబైల్ నందు ప్లే స్టోర్ లోకి వెళ్లి ఈసీఐ నెట్ యాప్ డౌన్లోడ్ చేసుకుని అందులో సర్ కి సంబంధించిన వివరాలన్నీ ఉంటాయని, ఈ ప్రక్రియ సులభతరం అవ్వాలంటే అందరూ కూడా ఈ యాప్ ను డౌన్లోడ్ చేసుకోవాలని ప్రజలకు తెలియజేస్తున్నామని టిడిపి వార్డు అధ్యక్షులు ఏడువాక సన్యాసిరావుఆధ్వర్యంలో తెలియజేశారు. కార్యక్రమంలో అధికార ప్రతినిధి మరియు క్లస్టర్ 1 ఇంచార్జి పాత్రకండ ధర్మారావు,సీనియర్ నాయకులు కెల్లా సత్యనారాయణ,వార్డు మహిళా అధ్యక్షురాలు మజ్జి రమణి, ప్రధాన కార్యదర్శి కర్రి మణి, నెల్లి అప్పారావు,ఓశెట్టి పైడిరాజు, తదితరులు పాల్గొన్నారు.

# అమరనాథ రెడ్డి తీవ్ర స్థాయిలో అసంతృప్తి

**తిరుపతి, జూన్ 16, పెన్ పవర్:** తెలుగుదేశం పార్టీలో సీనియర్ నేత ఎన్. అమరనాథ రెడ్డి ఎక్కడున్నారు. ఆయన టీడీపీలోనే ఉన్నారా? అసలు ఏం జరుగుతుంది? పార్టీలో ఒక్కసారిగా సైలెంట్ అయిన అమరనాథ రెడ్డి తీవ్ర స్థాయిలో అసంతృప్తికి లోనవుతున్నారా? అన్న అనుమానం కలుగుతుంది. దాదాపు రెండేళ్ల నుంచి అమరనాథ రెడ్డి పార్టీ లో యాక్టివ్ గా లేరు. గతంలో రాజకీయంగా కీలకంగా వ్యవహరించే అమరనాథ రెడ్డి ఈ టర్మ్ లో మాత్రం మౌనం పాటించడం వెనక కేవలం అసంతృప్తి కారణమని పార్టీ నేతలే చెబుతున్నారు. తనకు 2024 ఎన్నికల తర్వాత ప్రాధాన్యత దక్కడం లేదన్న అభిప్రాయంలో అమరనాథ రెడ్డి ఉన్నారు. అందుకే అమరావతికి కూడా దూరంగా ఉంటూ తన పని తాను చేసుకుంటున్నారు.చిత్తూరు జిల్లాలోని పలమనేరు నియోజకవర్గం నుంచి అమరనాథ రెడ్డి టీడీపీ ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఒక రకంగా చెప్పాలంటే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సొంత జిల్లా చిత్తూరులో ఉన్న ఈ నేత అందరినీ కలుపుకుని పార్టీని బలోపేతం చేయాల్సిన సమయం. అయితే తనకు తొలి విడత మంత్రి పదవి దక్కుతుందని భావించినప్పటికీ ఆయనకు రాలేదు. చిత్తూరు జిల్లా నుంచి కేవలం ముఖ్యమంత్రి గా చంద్రబాబు మాత్రమే ఉన్నారు. మరెవరికీ అవకాశం కల్పించలేదు. చంద్రబాబు జిల్లా పర్యటనకు వచ్చినప్పుడు మినహా మరే సందర్భంలో వీరు పెద్దగా కనిపించడం లేదు. అలాగే విపక్షాలు చేసే విమర్శలకు సయితం స్పందించడం లేదు.1996లో పుంగనూరు నియోజకవర్గంకి జరిగిన ఉప ఎన్నికలో తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా పోటీ చేసి గెలిచి తొలిసారి ఎమ్మెల్యేగా అసెంబ్లీకి ఎన్నికయ్యాడు. 1999లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేసి ఓటమిపాలై, 2004లో జరిగిన ఎన్నికల్లో పోటీ చేసి రెండోసారి ఎమ్మెల్యేగా గెలిచాడు. చిత్తూరు జిల్లా టీడీపీ అధ్యక్షుడిగా కూడా పని చేశారు.2009లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో పలమనేరు నియోజకవర్గం నుండి టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసి మూడోసారి ఎమ్మెల్యేగా గెలిచారు. 2012లో

టీడీపీకి రాజీనామా చేసి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరి 2014లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా పోటీ చేసి ఎమ్మెల్యేగా గెలిచారు.తర్వాత జూన్ 2016లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని విడి టీడీపీలో చేరాడు. 2017లో జరిగిన

ఆంధ్రప్రదేశ్ మంత్రివర్గ విస్తరణలో భాగంగా అమరనాథ్ రెడ్డికి మంత్రి పదవి లభించింది. 2024లో ఎన్నికల్లో తిరిగి టీడీపీ నుంచి విజయం సాధించారు. ట్రాక్ రికార్డును చూసిన తర్వాత మంత్రి పదవి దక్కాల్సి ఉన్నా రాకపోవడంతో ఆయన తన పెదవి విప్పడం లేదని అంటున్నారు.

03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పో. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

## దాడి వీరభద్రరావు దారెటు..

**విశాఖపట్టణం, జూన్ 16, పెన్ పవర్:** ఉమ్మడి విశాఖ జిల్లాలో తెలుగుదేశం పార్టీలో సీనియర్ మోస్ట్ లీడర్ గా దాడి వీరభద్రరావు ఉన్నారు. ఆయన 1985లో తొలిసారి ఎమ్మెల్యేగా గెలిచారు. అలా వరసగా నాలుగు సార్లు గెలిచి అనేక మంత్రిత్వ శాఖలను నిర్వహించిన దాడి 2007 నుంచి 2013 దాకా శాసనమండలిలో ప్రతిపక్ష నాయకుడిగా కూడా వ్యవహరించారు. అయితే ఆయన వైసీపీలోకి వెళ్ళడంతో ఆయన రాజకీయ జీవితం మీదనే కాకుండా కుమారుడి రాజకీయ భవిష్యత్తు మీద కూడా తీవ్ర ప్రభావం చూపిస్తోంది.తెలుగుదేశం పార్టీలో అయ్యన్నపాత్రుడితో సరిసమానంగా దాడి వీరభద్రరావు 1980, 1990 దశకంలో రాణించారు. ఇద్దరికీ మంత్రి పదవులు ఇచ్చి ఎన్టీఆర్ గౌరవించారు. అలాగే కీలక శాఖలను కూడా ఈ ఇద్దరు నేతలూ చూశారు. పూర్వాశ్రమంలో హిందీ మాస్టార్ గా పనిచేసిన దాడి అంటే ఎన్టీఆర్ కి ప్రత్యేకమైన అభిమానం ఉంది. అందుకే ఆయనకు కీలక స్థానం పార్టీలో కల్పించారు. ఇదిలా ఉంటే పార్టీ పదవులలో కూడా దాడికి ప్రముఖ స్థానం ఉంటూ వచ్చింది. అయితే ఆయన 2013లో తన ఎమ్మెల్సీ పదవిని రెన్యువల్ చేయలేదన్న కారణంతో టీడీపీని వీడారు. రాజకీయంగా అదే పెద్ద పొరపాటు అని ఆయన వర్గీయులు చెబుతున్నారు.అనకాపల్లిలో దాడి వీరభద్రరావు తన హవాను దశాబ్దాల పాటు చాటుకుంటూ వచ్చారు. ఎపుడైతే ఆయన టీడీపీని వీడారో నాటి నుంచే ఆయన ప్రాభవం తగ్గుతూ వచ్చింది. వైసీపీలో కూడా సరైన అవకాశాలు దక్కలేదు. దాంతో 2024 ఎన్నికల ముందు తిరిగి టీడీపీలో దాడి వీరభద్రరావు చేరారు. అయితే ఆయన కుమారుడు దాడి రత్నాకర్ కి అనకాపల్లి టికెట్ ఆశించినా దక్కలేదు. అయితే 2029 ఎన్నికల మీదనే దాడి కుటుంబం ఆశలు పెట్టుకుంది అని అంటున్నారు.అయ్యన్నపాత్రుడు కుమారుడు విజయ్ కి రాజ్యసభ సభ్యత్వం ఇచ్చి వారసులకు తగిన ప్రాధాన్యత ఇస్తున్నట్లుగా టీడీపీ సంకేతాలు పంపించింది. దాంతో దాడి లాంటి సీనియర్లలో కొత్త ఆశలు మొలకెత్తుతున్నాయని అంటున్నారు. తన వారసుడిని కూడా ఎమ్మెల్యేగా చూడాలని దాడి మాస్టారు ఆశ పడుతున్నారు. అనకాపల్లిలో టీడీపీ బలంగా ఉంది. ఇక దాడికి ప్రత్యేక వర్గం ఉంది. ఈ క్రమంలో వచ్చే ఎన్నికల మీద ఫోకస్ పెట్టి దాడి కుటుంబం పనిచేస్తోంది. అయితే అనకాపల్లిలో టీడీపీకి ఎంతో మంది నాయకులు ఉన్నారు. టికెట్ కోసం భారీ పోటీ ఉంది. దాడి పార్టీని వీడాక చాలా మంది నాయకులు తయారయ్యారు. ఈ నేపథ్యంలో వారిని అందరినీ దాటుకుని అధినాయకత్వం మన్ననలు అందుకోవడం అంటే ఆషామాషీ వ్యవహారం కాదని అంటున్నారు. ఇక పార్టీలో అవకాశాలు దక్కాలీ అంటే విధేయత కొలమాంగా చూస్తున్నారు.అలాగే పార్టీ కోసం కష్టించి పనిచేసే వారికే పట్టం కడుతున్నారు. మరి దాడి కుటుంబానికి న్యాయం జరుగుతుందా అన్నదే ఆయన అనుచరుల ఆలోచనగా ఉంది. మాస్టార్ రాజకీయ వారసత్వం కొనసాగాలని ఆయన అభిమానులు కోరుకుంటున్నప్పటికీ అనకాపల్లి టీడీపీ రాజకీయం మాత్రం అంత సానుకూలంగా లేదని అంటున్నారు. చూడాలి మరి ఏమి జరుగుతుందో.

## పీక్స్ కు చేరిన బ్రదర్స్ వార్

**విజయవాడ, జూన్ 16, పెన్ పవర్:** బెజవాడ పొలిటికల్ స్క్రీన్ మీద సరికొత్త 'బ్రదర్స్ వార్' పీక్స్ కి చేరింది. నిన్నటివరకు పార్టీల మార్పు, టికెట్ల రాజకీయం చుట్టూ తిరిగిన కేశినేని సోదరుల వివాదం.. ఇప్పుడు ఊహించని మలుపు తిరిగింది. ఒకరి జాతకాలను ఒకరు రోడ్డుపైకి లాగుతూ, ఏకంగా వందల కోట్ల బ్యాంక్ స్కామ్స్, ఈడీ ఫిర్యాదుల వరకు వెళ్లడంతో ఏపీ పాలిటిక్స్ ఒక్కసారిగా వేడెక్కాయి. 2024 ఎన్నికల ముగిసినా వీరి మధ్య మంటలు చల్లారకపోగా.. మరింత ముదరడం గమనార్హం. ఈ పొలిటికల్ ఫైట్‌లో విజయవాడ సిట్టింగ్ ఎంపీ కేశినేని చిన్ని వేసిన సరికొత్త స్కెచ్ ఇప్పుడు సంచలనంగా మారింది. తనపై వస్తున్న బినామీ, భూ ఆక్రమణల ఆరోపణలకు చెక్ పెడుతూ.. ఆయన నేరుగా మాజీ ఎంపీ కేశినేని నాని ఆర్థిక మూలాలనే టార్గెట్ చేశారు. ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకును నాని అడ్డంగా ముంచేశారని, దాదాపు రూ.120 కోట్ల ప్రజాధనాన్ని మొండి బకాయిలుగా మార్చేశారంటూ సంచలన ఆరోపణలు చేశారు. నిబంధనల్లోని లూప్‌హోల్స్‌ను వాడుకుంటూ నాని విజయవాడ 'విజయ్ మాల్యా'లా మారారని, చివరకు ఆయన ఉంటున్న ఇల్లు, వాడుతున్న హోటల్ కూడా బ్యాంక్ ఆధీనంలోనే ఉన్నాయంటూ చిన్ని బాంబ్ పేల్చారు. అయితే, తమ్ముడు వేసిన ఈ రివర్స్ అటాక్‌పై మాజీ ఎంపీ కేశినేని నాని కూడా ఏమాత్రం తగ్గడం లేదు. సోషల్ మీడియా వేదికగా ఆయన రీ-కౌంటర్ ఇచ్చారు. వేల కోట్ల ప్రభుత్వ భూములను ఒక కార్పొరేట్ సంస్థకు కట్టబెట్టే పెద్ద డీల్‌ను తాను సీఎంకు లేఖ రాసి అడ్డుకున్నానని, ఆ ఫ్రస్టేషన్‌తోనే తనపై కక్షసాధింపు చర్యలకు దిగుతున్నారని ఆరోపించారు. న్యాయ వ్యవస్థలో చిన్న లూప్ హోల్ అడ్డంపెట్టుకుని న్యాయస్థానాలనుసైతం కేశినేని నాని తప్పుదోవ పట్టించారని, తనపై పోటీ చేసిన అభ్యర్థుల్ని ఫ్రాడ్ అనటం కేశినేని నానికి అలవాటని కేశినేని చిన్ని తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. ప్రజారాజ్యం పార్టీ నుంచి బయటకొస్తూ చిరంజీవి, పవన్ కళ్యాణ్‌లనూ విమర్శించాడు. ఒక్క సాక్షి మీడియా, జగన్‌ను తప్ప ఇతరులదరినీ విరమర్శించే నాని ఆంతర్యం ఏంటి? అంటూ చిన్ని ప్రశ్నించారు.జగన్ పంథాలోనే దొంగే దొంగా దొంగా అని అరిచినట్లు చేయటం నానికి అలవాటు. సామాజిక మాధ్యమం వేదికగా నాని నాపై చేసేది అసత్య ఆరోపణలే. దీనిపై పోలీసులు తమ పని తాను చేసుకెళ్తున్నారు. విజయవాడ ప్రజలకు, అలాగే చంద్రబాబు నాయుడు, నారా లోకేష్, పవన్ కళ్యాణ్‌లకు మాత్రమే తాను జవాబుదారినని, సోషల్ మీడియా పోస్టులకు కాదని పేర్కొన్నారు. తనపై చేసే ఆరోపణలకు సరైన ఆధారాలు ఉంటే వాటికి సమాధానం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నానని కేశినేని చిన్నీ స్పష్టం చేశారు.బెజవాడ పాలిటిక్స్‌లో ఇలాంటి తాటాకు చప్పుళ్లకు భయపడే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు. ఈ ఇద్దరు నేతల మధ్య నడుస్తున్న ఈ కోట్ల రూపాయల మైండ్ గేమ్ రాబోయే రోజుల్లో ఇంకెన్ని సంచలనాలకు దారితీస్తుందో చూడాలి.

## రామ్మోహననాయుడికి అవకాశం లేదా...

**శ్రీకాకుళం జూన్ 16, పెన్ పవర్: :** భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం నిర్మాణ పనులు తుది దశకు చేరుకున్నాయి. ప్రారంభానికి కూత వేటు దూరంలో నిలిచింది. వచ్చే నెలలో ప్రారంభోత్సవం ఉంటుందన్న టాక్ నడుస్తోంది. మరోవైపు ప్రైవేటు విమానయాన సంస్థలు తమ కార్యకలాపాలను జూలై 5 నుంచి ప్రారంభించనున్నాయి. వాటికి సంబంధించి ప్రత్యేక ప్రకటన కూడా చేశాయి. ప్రస్తుతం చూస్తుంటే మాత్రం జూలైలో విమానాశ్రయం ప్రారంభం గ్యారెంటీ అని తేలిపోయింది.భోగాపురం విమానాశ్రయ నిర్మాణ పనులు శరవేగంగా జరగడంలో.. ఉత్తరాంధ్రకు చెందిన పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు కృషి ఉంది. గత రెండేళు_గా ఆయన నిరంతరం పర్యవేక్షిస్తూ పనులను పరుగెత్తించారు. అందుకే పనులు చాలా వేగంగా కొనసాగాయి. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలతో ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగడంతోనే చాలా వేగంగా పనులు జరిగాయి. ఇక్కడ విమాన రాకపోకలకు సంబంధించి ట్రయల్ రన్ సక్సెస్ అయ్యింది. చివరిగా పెండింగ్ పనులు జరుగుతున్నాయి. వచ్చే నెలలో ప్రారంభోత్సవానికి సంబంధించి ఏర్పాట్లు చురుగ్గా జరుగుతున్నాయి. ప్రధాని నరేంద్ర మోడీ చేతుల మీదుగా ప్రారంభించేందుకు కసరత్తు జరుగుతోంది.అయితే ఈ విమానాశ్రయ ప్రారంభోత్సవ సమయానికి కింజరాపు రామ్మోహన్ నాయుడు పరిస్థితి ఏంటనే చర్చ నడుస్తోంది. ఆయన ప్రస్తుతం పౌరవిమానయాన శాఖ మంత్రిగా ఉన్నారు. 2024 ఎన్నికల్లో మోడీ నేతృత్వంలో ఎన్డీఏ మూడోసారి అధికారంలోకి వచ్చింది. తెలుగుదేశం పార్టీ కీలక భాగస్వామి కావడంతో ఆ పార్టీకి రెండు మంత్రి పదవులు దక్కాయి కేంద్రంలో. రామ్మోహన్ నాయుడుకు కీలకమైన పౌర విమానయాన శాఖ దక్కింది. అయితే ఆయన బాధ్యతలు తీసుకున్న నాటి నుంచి ఏదో ఒక వివాదం రేగుతూనే ఉంది. ఆయన శాఖ మార్పు ఉంటుందన్న ప్రచారం ఎప్పటినుంచో ఉంది.కేంద్ర మంత్రివర్గ విస్తరణ చేపట్టేందుకు నరేంద్ర మోడీ కసరత్తు ప్రారంభించినట్లు ప్రచారం నడుస్తోంది. ఈ నెల 20న ముహూర్తంగా నిర్ణయించినట్లు సమాచారం. ఈనెల 18 తో రాజ్యసభ ఎన్నికల ప్రక్రియ కూడా పూర్తవుతుంది.

# డీఎస్సీలో కులాల లెక్కలు జాతర

**విజయవాడ, జూన్ 16, పెన్ పవర్:**
డీఎస్సీ 2025 పై వైయస్సార్ కాంగ్రెస్ అదే పనిగా విషప్రచారం చేస్తోంది. అవి రోజురోజుకు శృతిమించి కులాల వద్దకు కూడా చేర్చింది వైయస్సార్ కాంగ్రెస్. గతంలో కమ్మ డీఎస్పీలు అంటూ 2019 ఎన్నికలకు ముందు హడావిడి చేసిన సంగతి తెలిసిందే. తీరా వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత అదే పార్టీకి చెందిన మంత్రి కమ్మ డీఎస్పీలు కాదు.. అన్ని వర్గాల వారికి అవకాశం ఇచ్చారని శాసనసభలో ప్రకటించారు. అయితే ఇప్పుడు డీఎస్సీ 2025 పై దుష్ప్రచారం చేస్తున్న నేపథ్యంలో.. స్పోర్ట్స్ కోటా కింద కమ్మ సామాజిక వర్గం వారికి ఉపాధ్యాయ పోస్టులు ఇచ్చారని చెబుతూ.. కమ్మ డీఎస్పీ అంటూ ప్రచారాలు ప్రారంభించారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పేటీఎం చానల్స్ లో కూర్చోబెట్టి.. రిటైర్మెంట్ తీసుకున్న అధికారులతో కమ్మ అభ్యర్థులకు ఉద్యోగాలు ఇచ్చారంటూ విషం చిమ్మడం మొదలుపెట్టారు.డీఎస్సీ 2025 పై ప్రభుత్వం, పాఠశాల విద్యాశాఖ అధికారులు ఓపికగా వివరణ ఇచ్చే ప్రయత్నం చేస్తున్నారు. ఇప్పుడు కమ్మ డీఎస్సీ ఆరోపణలపై కూడా ఏపీ ఫ్యాక్ట్ చెక్ రంగంలోకి దిగి.. అదంతా తప్పుడు ప్రచారం అని తేల్చేసింది. ఈ డీఎస్సీలో స్పోర్ట్స్ కోటా కింద భర్తీ చేసిన పోస్టులు 381. ఈ 381 పోస్టుల్లో ఓపెన్ క్యాటగిరి కింద ఉన్నవి కేవలం 42 పోస్టులు మాత్రమే. మిగిలిన పోస్టులన్నీ ఎస్సీ, ఎస్ టి, బిసి, మైనారిటీ వర్గాలకు దక్కాయి. ఈ వివాదానికి ప్రధాన కారణం ఆనాలపై రెండు ఓపెన్ క్యాటగిరి పోస్టులు వాటిని పరిశీలిస్తే అందులో కమ్మ సామాజిక వర్గానికి చెందిన అభ్యర్థులకు వచ్చినవి కేవలం 9 పోస్టులు మాత్రమే. రెడ్డి సామాజిక వర్గానికి చెందిన అభ్యర్థులకు పది పోస్టులు, కాపు సామాజిక వర్గానికి చెందిన అభ్యర్థులకు అత్యధికంగా 16 పోస్టులు వచ్చాయి.వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ చేస్తున్న ప్రచారం తప్పుడు అని అందరికీ తెలుసు. ఎందుకంటే 381 పోస్టుల్లో.. 9 పోస్టులు అంటే కనీసం మూడు శాతం కూడా లేవు. కానీ ఏ లెక్క ప్రకారం స్పోర్ట్స్ కోటా మొత్తం ఒకే కులానికి కట్టబెట్టారు.. ఇందులో భారీ స్కాం జరిగింది అంటూ తప్పుడు ప్రచారాలు మొదలుపెట్టింది వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పేటీఎం బ్యాచ్. కేవలం మెరిట్, క్రీడా సర్టిఫికెట్ల స్క్రూటినీ ఆధారంగా జరిగిన ఈ నియామక ప్రక్రియను.. ఒక కులానికి ఆపాదించి వివాదం చేయడం చూస్తుంటే కుట్ర కోణం అర్థం అవుతోంది. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కేవలం రాజకీయ ఆరాటం కోసమే నిరుద్యోగ యువతను రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తోంది. దాదాపు ఆరు లక్షల మంది అభ్యర్థులు డీఎస్సీ పరీక్ష రాయడంతో వారిలో గందరగోళం రేపి రాజకీయ లబ్ధి పొందాలన్న ఆలోచన వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ. కానీ అది వర్క్ అవుట్ అయ్యే ఛాన్స్ లేదు. అయితే ఆధారాలు లేని ఆరోపణలతో దుష్ప్రచారం చేస్తున్న సదరు యూట్యూబ్ ఛానల్ పై కేసు నమోదు అయ్యే అవకాశం ఉంది. ఆధారాలు లేని కారణంగా ఆ యూట్యూబ్ ఛానల్ ఆ వీడియోను డిలీట్ కూడా చేసింది. కానీ వదిలిపెట్టే ప్రసక్తి కనిపించడం లేదు. నేరుగా సజ్జల ఫండింగ్ చేసిన ఆ ఛానల్ సంగతి తేల్చాలన్న అభిప్రాయం కూటమి శ్రేణుల్లో వినిపిస్తోంది.

# వేమిరెడ్డికి కీలకం పదవి...

**నెల్లూరు, జూన్ 16, పెన్ పవర్:**
నెల్లూరు అంటేనే మొదటి నుంచి కాంగ్రెస్ కి తరువాత కాలంలో వైసీపీకి అచ్చి వచ్చిన జిల్లాగా పేరుంది. రెడ్ల పెద్ద ఎత్తున రాజకీయ ప్రాబల్యం కలిగిన జిల్లాగా నెల్లూరుని చెబుతారు. ఉమ్మడి నెల్లూరు జిల్లాలో మొత్తం పది ఎమ్మెల్యే సీట్లు ఉంటే 2019లో పదికి పది స్వీప్ చేసి వైసీపీ శభాష్ అనిపించుకుంది. అయితే గిర్రున అయిదేళ్ల కాలం తిరిగేసరికి టీడీపీ కూటమి అదే ఫీట్ ని రివర్స్ లో చేసి వైసీపీకి భారీ షాక్ ఇచ్చేసింది. ఫలితంగా వైసీపీకి ఒక్కరంటే ఒక్కరు ఎమ్మెల్యే లేకుండా పోయారు. బలమైన నేతలు అంతా ఇపుడు టీడీపీలోనే ఉన్నారు. ఈ పరిణామాలతో వైసీపీ మొదటి నుంచి కూడదీసుకునే పనిలో ఉంది. కూటమి తన జోరుని ఎక్కడా తగ్గించడం లేదు, ప్రత్యేకించి టీడీపీ అయితే 2024లో దక్కిన విజయాన్ని ఆ రాజకీయ పట్టుని శాశ్వతం చేసుకోవాలని చూస్తోంది. దాని కోసం భారీ ఎత్తున వ్యూహ రచన కూడా చేస్తోంది.నెల్లూరు జిల్లాలో అంగ బలం అర్థ బలం దండీగా ఉన్న నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకరరెడ్డికి టీడీపీ భారీ గిఫ్ట్ ఇవ్వబోతోంది అని ప్రచారం సాగుతోంది. ఆయన 2018 నుంచి 2024 దాకా రాజ్యసభ మెంబర్ గా వైసీపీలో పనిచేశారు. వైసీపీని నెల్లూరు జిల్లాలో అన్ని విధాలుగా నిలబెట్టడంలో ఆయన కీలకమైన పాత్ర పోషించారు. ఆయనకు 2024 ఎన్నికల్లో ఎంపీ ఎమ్మెల్యే సీటు ఇవ్వడానికి వైసీపీ సుముఖత వ్యక్తం చేయకపోవడంతో టీడీపీ వైపు వచ్చారని ప్రచారం సాగింది. టీడీపీ ఆయనను సాదరంగా ఆహ్వానించి అక్కున చేర్చుకుని ఆయనకూ ఆయన సతీమణి ప్రశాంతి రెడ్డికి కూడా టికెట్లు ఇచ్చింది. దాంతో మొత్తం నెల్లూరు జిల్లా టీడీపీ కూటమికి చిక్కింది. ఈ నేపథ్యంలో వేమిరెడ్డి ప్రభాకరరెడ్డికి కేంద్ర మంత్రివర్గంలో పదవి దక్కుతుందని ప్రచారం ఊపందుకుంది. ఆయనకు సామాజిక పరంగానే కాదు రాజకీయంగా ప్రాంతీయ సమీకరణల దృష్ట్యా ఈ పదవిని ఇవ్వడం సముచితం అని పార్టీ పెద్దలు భావిస్తున్నారు అని అంటున్నారు. గ్రేటర్ రాయలసీమలో భాగంగా ఉన్న నెల్లూరు జిల్లాలో వేమిరెడ్డికి కేంద్ర మంత్రి పదవి ఇస్తే కనుక ఆ ప్రభావం కచ్చితంగా రాయలసీమ మీద కూడా పడుతుందని వచ్చే ఎన్నికల్లో వైసీపీ హార్డ్ కోర్ రీజియన్ గా ఉన్న రాయలసీమలో సైతం కూటమి అత్యధిక స్థానాలను గెలుచుకునేందుకు ఇది ఉపకరిస్తుందని కూడా టీడీపీ పెద్దలు వ్యూహరచన చేస్తున్నారు. గత ఎన్నికల్లో పార్టీని వీడిన వారిని వెనక్కి



రప్పించే ప్రయత్నంలో వైసీపీ అధినాయకత్వం ఉంది అని ప్రచారం సాగుతోంది. ఇక వేమిరెడ్డి మీద కూడా వైసీపీ ఫోకస్ పెట్టింది అని కూడా చెప్పుకున్నారు. ఆయన విలువ ఏమిటి అన్నది వైసీపీకి 2024 ఎన్నికల ఫలితాల తరువాత తెలిసింది అని అంటున్నారు. అయితే టీడీపీలో వేమిరెడ్డికి గౌరవం దక్కుతోంది, అంతే కాదు ఆయన అనుకున్నది చేసే పరిస్థితి కూడా ఉందని అంటున్నారు. ఇపుడు ఆయనకు కేంద్ర మంత్రి పదవి కూడా దక్కితే కనుక వైసీపీకి రాజకీయంగా మరింత దెబ్బ పడే పరిస్థితి ఉంటుందని అంటున్నారు. అంగబలం అర్థ బలంతో పాటు కేంద్ర మంత్రిగా బలం కూడా తోడు అయితే నెల్లూరు జిల్లాలో ఫ్యాన్ రెక్కలు జోరందుకోకుండా బ్రేకులు పడతాయని అంటున్నారు. మరి ఈ ప్రచారంలో నిజమెంత అన్నది వేచి చూడాల్సి ఉంది.

**నల్లపురెడ్డి దారెటు...**
నెల్లూరు జిల్లాలో రాజకీయాలు హీటెక్కాయి. ఎన్నికలకు మూడేళ్లకు ముందే టీడీపీ, వైసీపీ నేతల మధ్య మాటల యుద్ధం జరుగుతుంది. ప్రధానంగా జిల్లాలోని కోవూరు నియోజకవర్గంలో టీడీపీ ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి, వైసీపీ మాజీ ఎమ్మెల్యే నల్లపురెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డిల మధ్య సవాళ్లు, ప్రతిసవాళ్లు నడుస్తున్నాయి. వేమిరెడ్డిని ఎదుర్కొనేందుకు ప్రసన్నకుమార్ రెడ్డి వద్ద ప్లాన్ ఏంటి? కోవూరు నియోజకవర్గంలో ప్రశాంతి రెడ్డిని ఎదుర్కొనేందుకు నల్లపురెడ్డి వద్ద ఉన్న వ్యూహాలేంటి? అన్న దానిపై చర్చ జరుగుతుంది. ఎందుకంటే బలమైన నేతను ఎదుర్కొనాలంటే అంత ఆషామాషీ కాదు. జనంలో తీవ్రమైన వ్యతిరేకత వస్తేనే తప్ప విజయం సాధ్యం కాదు. కానీ ప్రశాంతి రెడ్డి ఆ ఛాన్స్ ను నల్లపురెడ్డికి ఎంతమేరకు ఇస్తారన్నది ప్రశ్న.కోవూరు నియోజకవర్గ రాజకీయాల్లో వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి, నల్లపరెడ్డి ప్రసన్న కుమార్ రెడ్డిల మధ్య తీవ్రమైన రాజకీయ మరియు విభేదాలు తీవ్ర స్థాయికి చేరుకున్నాయి. రాజకీయ ఆధిపత్యం చుట్టూ తిరుగుతుంది. వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి మరియు నల్లపరెడ్డి ప్రసన్న కుమార్ రెడ్డి మధ్య వార్ ఇంకా కొనసాగుతూనే ఉంది. వ్యక్తిగత విమర్శలు కూడా చోటు చేసుకుంటున్నాయి. ప్రసన్న కుమార్ రెడ్డి గతంలో ప్రశాంతి రెడ్డిపై చేసిన అనుచిత, వ్యక్తిగత వ్యాఖ్యలు వివాదాస్పదంగా మారాయి. వీటిపై ప్రశాంతి రెడ్డి తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసి పోలీసులకు ఫిర్యాదు చేశారు. మహిళా ఎమ్మెల్యే అయిన ప్రశాంతి రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేశారనే ఆరోపణలతో, మహిళల ఫిర్యాదు మేరకు ప్రసన్న కుమార్ రెడ్డిపై కోవూరు పోలీసులు కేసు నమోదు చేశారు.ఇటీవల వెన్నుపోటుకు రెండేళ్లు కార్యక్రమాన్ని వైసీపీ నిర్వహించింది. ఈ సందర్భంగా కోవూరు నియోజకవర్గంలో నల్లపురెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి భారీగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేపైనా, కూటమి ప్రభుత్వంపైన తీవ్ర విమర్శలు చేశారు. దీనికి వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి ఘాటుగా సమాధానం ఇచ్చారు. మెరుపుతీగలా కోవూరుకు వచ్చి వెళ్లే నేత గురించి పట్టించుకోవాల్సిన పనిలేదని ప్రశాంతి రెడ్డి నల్లపురెడ్డి పై విరుచుకుపడ్డారు. కోవూరు నియోజకవర్గం ప్రజలు తెలివైన వారని, వచ్చే ఎన్నికల్లోనూ ప్రసన్న గెలవలేంటూ సవాల్ విసిరారు. అంతేకాదు కోవూరు నియోజకవర్గంలో వైసీపీ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను కూడా తొలగించడం వివాదం గా మారింది. మొత్తం మీద ఎన్నికలకు మూడేళ్ల ముందే కోవూరు రాజకీయాలతో సలసల మండుతోంది.

## ఫిఫా వరల్డ్ కప్‌లో కోహ్లీ హవా.. విరాట్ వరల్డ్ కప్ గెలుస్తాడా?

# అంటూ ఫ్యాన్ టార్చర్.. ఐషోస్పీడ్ ఏం చేశాడంటే!





**హైదరాబాద్ పెన్ పవర్:** అమెరికాలో జరుగుతున్న ఫుట్‌బాల్ వరల్డ్ కప్ 2026లో కూడా కింగ్ విరాట్ కోహ్లీ రేంజ్ ఏంటో తెలిసే ఒక క్రేజీ అండ్ ఫన్నీ సీన్ చోటు చేసుకుంది. వరల్డ్ ఫేమస్ యూట్యూబ్ స్ట్రీమర్ ఐషోస్పీడ్ ఒక లైవ్ స్ట్రీమింగ్‌లో ఉండగా.. ఒక ఫ్యాన్ పదే పదే కోహ్లీ గురించి అడిగిన ఒకే ఒక ప్రశ్న స్పీడ్‌కు పిచ్చెక్కించింది. దాంతో విసిగిపోయిన స్పీడ్.. తనదైన స్టైల్ లో ఇచ్చిన రియాక్షన్ ఇప్పుడు సోషల్ మీడియాలో ట్రెండ్ అవుతుంది.

**కోహ్లీ కప్ గెలుస్తాడా బ్రో?:**

ఫిఫా వరల్డ్ కప్ జరుగుతున్న ఒక నగరంలో ఐషోస్పీడ్ రోడ్డుపై నడుస్తూ ఫ్యాన్స్ మధ్య లైవ్ స్ట్రీమింగ్ చేస్తున్నాడు. అక్కడ ఉన్న ఫుట్‌బాల్ వాతావరణాన్ని ఎంజాయ్ చేస్తూ అందరితో ముచ్చట్లు పెడుతున్న టైమ్‌లో.. గుంపులో ఉన్న ఒక ఫ్యాన్ గట్టిగా అరుస్తూ, ఈజ్ విరాట్ కోహ్లీ విన్నింగ్ ద వరల్డ్ కప్? (విరాట్ కోహ్లీ వరల్డ్ కప్ గెలుస్తాడా?) అని పదే పదే అడగడం స్టార్ట్ చేశాడు. అయితే, మొదట స్పీడ్ ఆ ప్రశ్నను పెద్దగా పట్టించుకోకుండా లైట్ తీసుకున్నాడు. కానీ ఆ ఫ్యాన్ మాత్రం అస్సలు తగ్గలేదు.. స్పీడ్ లైవ్ స్ట్రీమింగ్‌కు అడ్డొచ్చేలా కంటిన్యూస్‌గా అదే క్వశ్చన్‌ను రిపీట్ చేశాడు.

**చిరాకుతో ఊగిపోయిన ఐషోస్పీడ్:**

ఆ ఫ్యాన్ అడిగిన ప్రశ్నతో లైవ్‌కు డిస్టర్బెన్స్ రావడంతో.. ఐషోస్పీడ్ తన ట్రేడ్‌మార్క్ యానిమేటెడ్ అగ్రెసివ్ స్టైల్‌లో గట్టిగా అరుస్తూ, విరాట్ కోహ్లీ ఈజ్ విన్నింగ్ ద వరల్డ్ కప్! (హా.. విరాట్ కోహ్లీనే వరల్డ్ కప్ గెలుస్తున్నాడు!) అంటూ కోపంగా ఆన్సర్ ఇచ్చాడు. ఆ సీన్ చూడగానే చుట్టూ ఉన్న వాళ్లంతా ఒక్కసారిగా నవ్వేశారు. ఈ క్లిప్ సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతుంది.

**ఫుట్‌బాల్ వరల్డ్ కప్‌లో క్రికెట్ పంచాయితీ:**

ఈ వీడియో చూసిన నెటిజన్లు తెగ నవ్వుకుంటున్నారు. అక్కడ జరుగుతోంది ఫిఫా ఫుట్‌బాల్ వరల్డ్ కప్ కాబట్టి.. ఆ ఫ్యాన్ అడిగిన ప్రశ్న వచ్చే ఏడాది (2027) జరగబోయే ఐసీసీ క్రికెట్ వరల్డ్ కప్ గురించి అయి ఉంటుందని ఫ్యాన్స్ డిసైడ్ అయ్యారు. ఇక క్రిస్టియానో రొనాల్డోకి పెద్ద ఫ్యాన్ అయిన ఐషోస్పీడ్‌కు.. గతంలో ఇండియా వచ్చినప్పుడు విరాట్ కోహ్లీ క్రేజ్ ఏంటో ఆల్రెడీ రుచి చూశాడు. ఇప్పుడు ఫుట్‌బాల్ వరల్డ్ కప్ వంటి ఒక గ్లోబల్ ఈవెంట్‌లో కూడా కోహ్లీ పేరు ఇలా మారుమోగిపోవడం చూసి కింగ్ ఫ్యాన్స్ విరాట్ కోహ్లీ రేంజ్ అన్ స్టాపబుల్ బ్రో అంటూ కాలర్ ఎగరేస్తున్నారు.

## మెస్సీ అంటే ప్రపంచానికి పిచ్చి.. అతడి ఆట కోసం వెయిటింగ్.. కోచ్ వ్యాఖ్యలు వైరల్



**హైదరాబాద్ పెన్ పవర్:** ఫిఫా ప్రపంచ కప్ లో భాగంగా ఈరోజు ( జూన్ 17న తెల్లవారుజామున, బుధవారం) రాత్రికి అల్జీరియాతో డిఫెండింగ్ ఛాంపియన్ అర్జెంటీనా తమ తొలి మ్యాచ్ ఆడబోతుంది. ఫుట్‌బాల్ దిగ్గజం లియోనెల్ మెస్సీకి ఇది 200వ ఇంటర్నేషనల్ మ్యాచ్ కావడం విశేషం.. ఈ ఫిఫా ప్రపంచ కప్ మెస్సీకి చివరిదంటూ వార్త కథనాలు వస్తున్నాయి. దీంతో మెస్సిని మైదానంలో చూడాలని భారీగా ఫ్యాన్స్ వెయింటింగ్ చేస్తున్నారు. కొంతకాలంగా కండరాల గాయంతో ఇబ్బంది పడుతున్న లియోనల్.. పూర్తి ఫిట్‌నెస్ సాధించినట్లు టాక్. ఇక అర్జెంటీనా ప్రధాన కోచ్ లియోనెల్ స్కలోని.. మెస్సిపై ప్రశంసలు గుప్పించాడు. ప్రపంచ మొత్తం అతడి కోసం వేచి చూస్తోందని వెల్లడించాడు.

**మెస్సి కోసం ప్రపంచం మొత్తం వెయిటింగ్:**

అర్జెంటీనా ఫ్యాన్స్ మాత్రమే కాదు.. ప్రపంచం మొత్తం లియోనల్ మెస్సిని గ్రౌండ్ లో చూడాలని ఈగర్ గా వెయిటింగ్ చేస్తుంది. అతడు కేవలం మా జట్టుకే కాదు ప్రపంచ ఫుట్‌బాల్‌కే ప్రత్యేక ఆకర్షణగా నిలిచాడు.. మెస్సి గురించి చెప్పడానికి ఏమీ లేదు.. అతడు ఎప్పుడూ జట్టుకు అండగా నిలిచాడు.. టీమ్ విజయాల్లో మెస్సి పాత్రే అత్యంత కీలకం అన్నాడు. మెస్సి ఫుట్‌బాల్ దేవుడు అనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదని స్కలోని చెప్పుకొచ్చాడు.

**మెస్సితో కలిసి ఆడటం గర్వంగా ఉంది:**

ఖతార్ వేదికగా జరిగిన ఫిఫా ప్రపంచ కప్ 2022 టైటిల్‌ను అర్జెంటీనా దక్కించుకున్న విషయం తెలిసిందే. మరోసారి టైటిల్‌ను నిలబెట్టుకోవాలనే టార్గెట్ తో బరిలోకి మెస్సి సేన దిగబోతుంది. ఈ సందర్భంగా మెస్సి సహచరుడు నికోలస్ ఒటమెండీ మాట్లాడుతూ.. ఖతార్‌లో సాధించిన గెలుపు దేశాన్ని ఒక్కటి చేసిందన్నాడు. ఆ జ్ఞాపకాలు మాకు మరింత బలాన్ని ఇస్తున్నాయి.. అదే పట్టుదలతో మళ్లీ బరిలోకి దిగబోతున్నామని వెల్లడించారు. కానీ, మెస్సితో కలిసి ఆడటం నాకు చాలా గర్వంగా అనిపిస్తుంటుంది.. అతడు అసాధారణ వ్యక్తి.. స్టేడియంలో మెస్సి ఓ యోధుడు కనిపిస్తాడని పేర్కొన్నాడు.

## శ్రేయస్?ను పక్కన పెట్టి సూర్యను పెట్టారేంటి.. సోనీ స్పోర్ట్స్‌పై నెటిజన్స్ ఫైర్





**హైదరాబాద్ పెన్ పవర్:** భారత టీ20 జట్టు కెప్టెన్సీ లొల్లి ఇప్పుడు సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. టీ20 వరల్డ్ కప్ గెలిచిన తర్వాత బీసీసీఐ ఊహించని విధంగా సూర్యకుమార్ యాదవ్‌ను కెప్టెన్సీ నుంచి తప్పించి.. అతని ప్లేస్‌లో శ్రేయస్ అయ్యర్‌ను కొత్త కెప్టెన్‌గా ప్రకటించింది. ఈ ఐర్లాండ్, ఇంగ్లాండ్ టూర్ల కోసం కొత్త టీమ్ ని ప్రకటించింది. అఫీషియల్ బ్రాడ్‌కాస్టర్ సోనీ స్పోర్ట్స్ నెట్‌వర్క్ చేసిన ఒక పెద్ద పొరపాటుపై ఇప్పుడు నెటిజన్లు తీవ్రంగా మండిపడుతున్నారు.

**కొత్త కెప్టెన్‌కు నో ఛాన్స్.. పాత కెప్టెన్‌తో ప్రోమో:**

ఈరోజు (జూన్ 16, మంగళవారం) మధ్యాహ్నం 12:18 గంటలకి సోనీ స్పోర్ట్స్ ఇంగ్లాండ్ సిరీస్ కోసం భారీ హైప్ ఇచ్చేలా విడుదల చేసిన ప్రోమో వీడియోను ఎక్స్ (ఠ) లో పోస్ట్ చేసింది. గత ఏడాది ఇంగ్లాండ్‌తో జరిగిన 5 మ్యాచ్‌ల టెస్ట్ సిరీస్ విజువల్స్‌ను వాడుకుంటూ ఈ వైట్-బాల్ సిరీస్ కోసం బిల్డప్ ఇచ్చింది. కానీ, ఇక్కడే సోనీ టీమ్ ఒక పెద్ద బ్లండర్ మిస్టేక్ చేసింది. టీమిండియా లేటెస్ట్ అప్‌డేట్స్‌ను మర్చిపోయి.. కొత్త కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ విజువల్స్ పెట్టకుండా, మాజీ కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్‌ను మెయిన్ ఫేస్‌గా చూపిస్తూ ప్రోమో వదిలింది.

**ప్రోమోలో లేని అయ్యర్.. మీమ్స్‌తో ఫ్యాన్స్ లొల్లి:**

ఈ వీడియో కాస్తా క్షణాల్లో సోషల్ మీడియాలో వైరల్ అయిపోయింది. దాంతో క్రికెట్ ఫ్యాన్స్ బీసీసీఐ ఏమో సూర్యను కెప్టెన్సీ నుంచి తీసేస్తే.. సోనీ స్పోర్ట్స్ ఏమో ప్రోమో నుంచి కొత్త కెప్టెన్ శ్రేయస్ అయ్యర్‌ను తీసేసి సూర్యను తెచ్చిందంటూ మీమ్స్ వేసి జోకులు పేల్చారు. ఫ్యాన్స్ తప్పును ఎత్తిచూపడంతో అలర్ట్ అయిన సోనీ స్పోర్ట్స్.. వెంటనే ఆ ట్వీట్‌ను డిలీట్ చేసింది. ఇప్పటి వరకు కొత్త ప్రోమో అయితే రాలేదు కానీ, తప్పును సరిదిద్దుకుని త్వరలోనే కొత్తది రిలీజ్ చేయనున్నారు.

**కావాలనే శ్రేయస్‌ను పక్కన పెట్టలేదు:**

సాధారణంగా భారత్ లో జరిగే హోమ్ మ్యాచ్‌ల బ్రాడ్‌కాస్టింగ్ రైట్స్ స్టార్ స్పోర్ట్స్ (ఘ్రుతీ రాజూశీతీం) దగ్గర ఉన్నాయి. కొత్త కెప్టెన్, పంజాబ్ కింగ్స్ కెప్టెన్ అయిన శ్రేయస్ అయ్యర్ గత చాలా కాలంగా ఇండియా తరఫున టీ20 మ్యాచ్‌లు ఆడలేదు.. దాంతో సోనీ స్పోర్ట్స్ దగ్గర శ్రేయస్ బ్లూ జెర్సీలో ఉన్న విజువల్స్ ఏవీ అందుబాటులో లేవు.. అందుకే వాళ్లు సూర్యకుమార్ యాదవ్ ఫుటేజ్‌ని వాడాల్సి వచ్చింది.

**ఇంగ్లాండ్ టూర్‌కు వెళ్లే టీమిండియా:**

శ్రేయస్ అయ్యర్ (కెప్టెన్), తిలక్ వర్మ, రవి బిష్ణోయ్, అభిషేక్ శర్మ, నితీష్ కుమార్ రెడ్డి, మహమ్మద్ సిరాజ్, సంజు శాంసన్ (వికెట్ కీపర్), అక్షర్ పటేల్, హర్షిత్ రాణా, ఇషాన్ కిషన్, వాషింగ్టన్ సుందర్, అర్ష్‌దీప్ సింగ్, శివమ్ దూబే, వరుణ్ చక్రవర్తి, ప్రిన్స్ యాదవ్, వైభవ్ సూర్యవంశీ.



# ఆ మూవీతో సమంత స్పెషల్ బాండ్.. 'అదే నా బెస్ట్'





టాలీవుడ్ స్టార్ హీరోయిన్ సమంత చాలా కాలం తర్వాత 'మా ఇంటి బంగారం' సినిమాతో మన ముందుకు రాబోతున్నారు. నందిని రెడ్డి దర్శకత్వంలో వస్తున్న ఈ క్రేజీ ప్రాజెక్ట్ జూన్ 19న విడుదల కానుంది. ప్రస్తుతం ఈ సినిమా ప్రమోషన్స్ లో ఫుల్ బిజీగా గడుపుతున్న సమంత.. తాజాగా పాల్గొన్న ఒక ఇంటర్వ్యూలో తన కెరీర్, సినిమాలపై కొన్ని ఆసక్తికరమైన కామెంట్స్ చేశారు. ముఖ్యంగా తన మొదటి సినిమా 'ఏ మాయ చేసావే' పై ఆమె చూపించిన ప్రేమ ఇప్పుడు సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. ఆ వివరాలు చూద్దాం..

**ర్యాపిడ్ ఫైర్ రౌండ్‌లో సమంత ఇంట్రెస్టింగ్ ఆన్సర్స్:**

ఇక ప్రమోషన్స్ లో భాగంగా జరిగిన ఒక ఇంటర్వ్యూలో సమంతకు కొన్ని క్రేజీ ప్రశ్నలు ఎదురయ్యాయి. ర్యాపిడ్ ఫైర్ రౌండ్‌లో ఆమె నటించిన హిట్ సినిమాలలో ఒకదాన్ని ఎంచుకోమని అడిగారు. ముందుగా 'ఏ మాయ చేసావే' లేదా 'ఈగ' అని అడగగా.. సమంత ఏమాత్రం ఆలోచించకుండా 'ఏ మాయ చేసావే' వైపే మొగ్గు చూపారు. ఆ సినిమానే తనకు కెరీర్ ఇచ్చిందని, అది లేకపోతే 'ఈగ' లాంటి పెద్ద ప్రాజెక్టులు వచ్చేవి కావని క్లారిటీ ఇచ్చారు.

**'రంగస్థలం', 'ఓ బేబీ'లకే ఓటు వేసిన సామ్:**

ప్రశ్నలు కొనసాగుతూ.. 'ఓ బేబీ' లేదా 'అ ఆ' అని అడగగా ఆమె 'ఓ బేబీ'ని ఎంచుకున్నారు. అలాగే లేడీ ఓరియెంటెడ్ ఫిల్మ్ 'యశోద' లేదా 'రంగస్థలం' లలో దేన్ని ఇష్టపడతారని అడిగితే.. మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ సరసన నటించిన 'రంగస్థలం' చిత్రానికే సమంత ఓటు వేశారు. ఇక వెబ్ సిరీస్ ల విషయానికి వస్తే 'సిటాడెల్' కంటే 'ది ఫ్యామిలీ మ్యాన్' వైపే మొగ్గు చూపారు.

**'ఫ్యామిలీ మ్యాన్' ని కాదని మళ్ళీ 'ఏ మాయ చేసావే':**

అయితే అసలైన ట్విస్ట్ చివర్లో ఎదురైంది. సమంతకు భారీ గుర్తింపు తెచ్చిన 'ది ఫ్యామిలీ మ్యాన్' సిరీస్ లేదా ఆమె మొదటి చిత్రం 'ఏ మాయ చేసావే' లో ఏది బెస్ట్ అని హోస్ట్ అడిగారు. దానికి కూడా సమంత 'ఏ మాయ చేసావే' సినిమానే ఎంచుకున్నారు. "ఆ సినిమా లేకపోతే ఈ రోజు నేను ఇక్కడ ఉండేదాన్ని కాదు, అది నా జీవితాన్ని మార్చేసింది" అంటూ తన డెబ్యూ మూవీపై ఉన్న స్పెషల్ బాండ్ ను బయటపెట్టారు.

**నెట్టింట తెగ వైరల్ అవుతున్న వీడియో:**

సమంత చేసిన ఈ వ్యాఖ్యలు ఇప్పుడు సోషల్ మీడియాలో విపరీతంగా చక్కర్లు కొడుతున్నాయి. దీనికి ఒక ముఖ్యమైన కారణం కూడా ఉంది. 'ది ఫ్యామిలీ మ్యాన్' సిరీస్‌కు సమంత భర్త రాజ్ నిడిమోరు దర్శకుడు కాగా.. 'ఏ మాయ చేసావే' సినిమాలో ఆమె మాజీ భర్త నాగచైతన్య హీరోగా నటించారు. అయినప్పటికీ, సమంత వ్యక్తిగత విషయాలను పక్కన పెట్టి.. తన సినీ ప్రయాణానికి పునాది వేసిన మొదటి చిత్రానికే పెద్ద పీట వేయడం నెటిజన్ల మనసులను గెలుచుకుంటోంది... చివరగా చెప్పాలంటే, ఎంత ఎదిగినా ఒదిగి ఉండడం అంటే ఇదేనేమో. సమంత నేడు పాన్-ఇండియా స్టార్‌గా ఎంతటి గుర్తింపు తెచ్చుకున్నా.. తనను ఇండస్ట్రీకి పరిచయం చేసిన మొదటి సినిమాను, ఆ పాత్రను గుండెల్లో దాచుకుందని ఈ ఇంటర్వ్యూతో ప్రూవ్ అయింది. మరి జూన్ 19న రాబోతున్న 'మా ఇంటి బంగారం' సినిమాతో సమంత ఎలాంటి మ్యాజిక్ క్రియేట్ చేయబోతుందో చూడాలి!

Printed By Published By Gantyada Apparao On Behalf Of Gantyada Apparao, Printed At Sri Sai Ganga Printers And Publishers Flat No : 504, Bharat Towers, 5th Lane Dwarakanagar, Visakhapatnam, Andhra Pradesh - 530016, And Published At FLAT NO. 31, RAJEEV NAGAR, VISAKHA A COLONY, NEAR JAMATHOTA, KILLIPALEM PANCHAYAT, PATHAPATNAM, SRIKAKULAM DIST. "PEN POWER" vide PRGI Registration No. "APTEL/25/A4918" Editor: GANTYADA APPARAO. e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965PANCHAYAT, PATHAPATNAM, SRIKAKULAM DIST. Editor GANTYADA APPARAO.e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965